మళ్లీ జోరుగా చేపల అమ్మకం

● ధర తగ్గడంతో పోటెత్తిన మాంసాహారులు







నాటు పడవలో చిన్న సైజు చేపలతో తీరానికి వస్తున్న జాలరి



భారీ సైజు చేపలు

కాశిమేడు ఫిషింగ్ హార్బర్‌కు పెద్ద తరలివెళ్లిన మాంసాహారులు



పీతలు విక్రయిస్తున్న మహిళ



పెద్ద చేప పట్టుబడిన ఆనందంలో మత్స్యకారుడు

ప్యారీస్, జూన్ 16: బంగాళాఖాతంలో చేపల వేట నిషేధం ఎత్తివేసిన నేపథ్యంలో ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఫిషింగ్ మార్కెట్లలో చేపల విక్రయాలు జోరుగా సాగాయి. చేపల దిగుబడి అధికంగా ఉండడంతో మార్కెట్లలో కొంత ధరలు తగ్గడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. బంగాళాఖాతంలో చేపలు, సముద్ర జీవుల సంతానోత్పత్తి జరిగే సమయంలో రాష్ట్రప్రభుత్వం విధించిన 61 రోజుల నిషేధ కాలం ముగిసి ఈనెల 14వ తేది అర్ధరాత్రి నుంచి మళ్లీ కడలిపుత్రులు చేపల వేటను కొనసాగిస్తున్నారు. ఇన్నాళ్లు నాటు పడవలతో మాత్రమే చేపల వేటకు వెళ్లిన మత్స్యకారులు ప్రస్తుతం మరపడవల్లో వారం రోజులకు సరిపడే డీజిల్, ఆహారం, మంచు గడ్డలు తదితరాలు సమకూర్చుకుని చేపలు అధికంగా లభ్యమయ్యే ప్రాంతాలకు వెళుతున్నారు. 14వ తేది అర్ధరాత్రి వెళ్లిన జాలర్లు వేట ముగించుకొని ఆదివారం తెల్లవారుజాముకి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సముద్రతీరాలకు తిరిగొచ్చారు. తమ వలలో చిక్కిన చిన్నసైజు నుంచి భారీ సైజు చేపలను ఫిషింగ్ మార్కెట్లకు తరలించి వేలం పాట ద్వారా విక్రయిస్తున్నారు. ఆదివారం పెద్దసంఖ్యలో చేపల కొనుగోలుకు తరలివెళ్లిన ప్రజలతో మార్కెట్ ప్రాంతాలు, ఫిషింగ్ హార్బర్లు కిటకిటలాడాయి.

స్టాలిన్ పగటి కలలు ఫలించవు : ఈపీఎస్



చెన్నై, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకే కూటమి 200 సీట్లను గెలుచుకుంటుందని ఆ పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ పగటికలలు కంటున్నారని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి(ఈపీఎస్)అన్నారు. ఆదివారం ఉదయం మదురై విమానాశ్రయం వద్ద మీడియా ప్రతినిధులతో ఆయన మాట్లాడుతూ బీజేపీ ఆదేశం వల్లే విక్రవాండి ఎన్నికలను అన్నాడీఎంకే బహిష్కరించిందని కాంగ్రెస్ సీనియర్ నేత పి. చిదంబరం పేర్కొనడం విడ్డూరంగా ఉందన్నారు. చిదంబరానికి అన్నాడీఎంకేకు సంబంధం లేదని, ఆయన మాటలను పట్టించుకోవాల్సిన అవసరం లేదన్నారు. డీఎంకే అధికారంలోకి వచ్చాక జరిగిన ఈరోడ్ అసెంబ్లీ నియోజకవర్గం ఉప ఎన్నికలలో పెద్దయెత్తున అక్రమాలు జరిగాయని, ఓటర్లను ఓటు వేయకుండా బెదరించారని, అలాంటి పరిస్థితులే విక్రవాండిలో పునరావృతమవుతాయని, ప్రజాస్వామ్యం అపహాస్యానికి గురవుతుందని భావించే ఎన్నికలను బహిష్కరించాలని తమ పార్టీ నిర్ణయించిందని తెలిపారు. విక్రవాండి ఉప ఎన్నికలు స్వేచ్ఛగా, ప్రజాస్వామ్యబద్ధంగా జరుగుతాయనే నమ్మకం తమకులేదని ఈపీఎస్ అన్నారు. 2026లో జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకే కూటమి 200లకుపైగా సీట్లను గెలుచుకుంటుందని, శనివారం సాయంత్రం జరిగిన కోయంబత్తూరు సభలో స్టాలిన్ ప్రకటించడం విడ్డూరంగా ఉందన్నారు. 2019లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో డీఎంకే కూటమి 38 నియోజకవర్గాలను గెలుచుకుందని, ఆ తర్వాత జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో అన్నాడీఎంకే పత్తా లేకుండా పోతుందని అందరూ అనుకున్నారని, అయితే అన్నాడీఎంకే 75 నియోజకవర్గాలలో గెలిచిందని తెలిపారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో 10 అసెంబ్లీ నియోజకవర్గాలలో డీఎంకే కంటే అన్నాడీఎంకే అత్యధికంగా ఓట్లు పొందిందని చెప్పారు. లోక్‌సభ ఎన్నికల్లో అన్నాడీఎంకే ఓడిపోయినంత మాత్రాన అసెంబ్లీ ఎన్నికల్లోనూ తమకు ఓటమే మిగులుతుందని అప్పుడే స్టాలిన్ పగటి కలలు కంటున్నారని ఈపీఎస్ యెద్దేవా చేశారు.

రోజూ 400 మందితో తిరుమల యాత్ర

మంత్రి రామచంద్రన్

ప్యారీస్, జూన్ 16: శ్రీవెంకటేశ్వర స్వామి కొలువై ఉన్న తిరుమలగిరులకు రోజుకు 400 మందితో తమిళనాడు టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీటీడీసీ) ఆధ్వర్యంలో యాత్ర నిర్వహిస్తున్నట్లు మంత్రి రామచంద్రన్ పేర్కొన్నారు. రాష్ట్రప్రభుత్వ నిర్వహణలోని టీటీడీసీ ఆధ్వర్యంలో చేపడుతున్న పర్యాటక పథకాల్లో అధికంగా ప్రజలు ఇష్టపడుతున్న యాత్రలలో తిరుపతి-తిరుమల ఒకరోజు యాత్రకు విశేష స్పందన ఉంది. రాష్ట్రంలోని టీటీడీసీ ప్రధాన కార్యాలయాల నుంచి ప్రతిరోజు తిరుమలకు యాత్రా స్పెషల్ పేరుతో నడుపుతున్న బస్సుల్లో యాత్రికుల సౌకర్యార్థం గైడ్‌లను ఏర్పాటు చేసినట్లు మంత్రి రామచంద్రన్ ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. తిరువళ్లూర్ జిల్లా తిరుత్తణి ప్రాంతంలోని టీటీడీసీ హోటల్‌లో యాత్రికులకు ఉదయం టిఫిన్ పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. టీటీడీసీకి తిరుమల తిరుపతి దేవస్థానం ప్రత్యేక అనుమతి పథకం కింద శీఘ్రదర్శనం రసీదు ద్వారా యాత్రికులు సులువుగా శ్రీవారిని దర్శనం చేసుకోగలుగుతున్నారని, ఒక్కొక్క భక్తుడికి లడ్డు ప్రసాదాన్ని కూడా పంపిణీ చేయడంతో పాటు మధ్యాహ్న భోజనం అనంతరం తిరుచానూరు క్షేత్రానికి వెళ్లి పద్మావతి అమ్మవారిని దర్శించుకునే అవకాశం కూడా కల్పిస్తున్నట్లు మంత్రి తెలిపారు. రాత్రి భోజనం అనంతరం యాత్రికులను మళ్లీ వారు బయల్దేరిన ప్రాంతాలకే తీసుకురావడంతో ఒక రోజు తిరుమల యాత్ర ముగుస్తుందన్నారు. టీటీడీసీ విహారయాత్రలకు సంబంధించి రిజర్వేషన్ చేయదల్చుకొనేవారు www.ttdconline.com అనే వెబ్‌సైట్‌లో కానీ, స్థానిక వాలాజా రోడ్డులో ఉన్న టీటీడీసీ ప్రధాన కార్యాలయాన్ని నేరుగా సంప్రదించవచ్చన్నారు. ముఖ్యంగా తిరుపతి-తిరుమల యాత్రకు సంబంధించి 1800 4253 9911, 044-25333333 అనే నెంబర్లలో సంప్రదించవచ్చని మంత్రి రామచంద్రన్ తెలిపారు.

క్షేత్ర స్వరూపిణి అమ్మ

శ్రీకళాసుధ వేడుకల్లో 'భారతీయం' సత్యవాణి





గురుశ్రీ పురస్కారాన్ని స్వీకరిస్తున్న 'భారతీయం' సత్యవాణి - వేడుకల్లో పాల్గొన్న తెలుగు ప్రముఖులు


అడయార్, జూన్ 16: భారతీయ సంస్కృతిలో అమ్మ క్షేత్ర స్వరూపిణి అని సౌశీల్య అకాడమి వ్యవస్థాపకురాలు 'భారతీయం' సత్యవాణి అన్నారు. శ్రీకళాసుధ తెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో ఫాదర్స్ డే (పితృదేవోభవ) వేడుకలు ఆదివారం జరిగాయి. స్థానిక టి.నగర్‌లోని ఆస్కా ప్రాంగణంలో ఉన్న గోదావరి హాల్‌లో జరిగిన ఈ వేడుకల్లో సౌశీల్య అకాడమి వ్యవస్థాపకురాలు 'భారతీయం' సత్యవాణికి "గురుశ్రీ" పురస్కారాన్ని కళాసుధ అధ్యక్షుడు బేతిరెడ్డి శ్రీనివాస్, ఈ కార్యక్రమానికి ప్రత్యేక అతిథులుగా హాజరైన ప్రముఖ సంగీత దర్శకుడు సాలూరి వాసూరావు, క్రెడాయ్ మహిళా విభాగం అధ్యక్షురాలు, వీజీఎన్ హోమ్స్ డైరెక్టర్ పద్మాదేవదాస్, సినీ నేపథ్యగాయకుడు వీబీ ఫణీంద్రలతో కలిసి ఘనంగా సన్మానించి, ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సాలూరు వాసూరావు మాట్లాడుతూ, శ్రీకళాసుధ తెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగే ఫాదర్స్ డే వేడుకల్లో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. తనకు వ్యక్తిగతంగా కంటే తన తండ్రి సాలూరు రాజేశ్వరరావు గారి అబ్బాయిగానే ఎక్కువ గుర్తింపు లభించిందన్నారు. తల్లిదండ్రులకు వేర్వేరుగా మదర్స్ డే, ఫాదర్స్ డేలను వేర్వేరు తేదీల్లో నిర్వహించడం కంటే తల్లిదండ్రులకు కలిపి ఒకే తేదీలో నిర్వహిస్తే బాగుంటుందని, దీనికి భారతీయం సత్యవాణి ఓ మార్గం చూపించాలని ఆయన కోరారు. భారతీయం సత్యవాణి మాట్లాడుతూ, 'గురుశ్రీ' పురస్కారానికి తాను అర్హురాలిని కాదన్నారు. అందుకే ఈ పురస్కారాన్ని తన గురువు చంద్రశేఖరస్వామి పాదాలకు సమర్పిస్తున్నట్టు తెలిపారు. భారతీయ సంస్కృతిలో ప్రత్యేక దినోత్సవాలు లేవన్నారు. ప్రాశ్చాత్య సంస్కృతి నుంచి ఇవి మనకు దిగుమతి అయ్యాయని తెలిపారు. ఒకవిధంగా ఇలాంటి వేడుకలు జరుపుకోవడం మంచిదేనన్నారు. యేడాదికి ఒక్కసారైనా మన ఆత్మీయులను స్మరించుకునే అవకాశం లభిస్తుందన్నారు. పార్వతీపరమేశ్వరులది విడదీయలేని బంధమన్నారు. అందువల్ల పితృదేవోభవ, మాతృదేవోభ అని కాకుండా, ఒకే వేడుకను నిర్వహించుకుంటే మంచిదన్నారు. మాతృ దేవోభవ, పితృ దేవోభవ, ఆచార్య దేవోభవ, అతిథి దేవోభవ అని మన పెద్దలు అంటుంటారన్నారు. దీనివెనుక గొప్ప అర్థం ఉందన్నారు. అమ్మ నాన్నను పరిచయం చేస్తే, నాన్న గురువును పరిచయం చేస్తారని, గురువు సమాజాన్ని పరిచయం చేసి, ఎలాంటి సత్‌ప్రవర్తనతో నడుచుకోవాలో నేర్పుతారన్నారు. ఆంగ్ల పదాలైన 'షీ'లో హీ, ఫీమేల్‌లో మేల్, ఉమెన్‌లో మెన్ ఉన్నారన్నారు. ఇక్కడ ప్రతి పదంలో స్త్రీ ముందు ఉంటారన్నారు. అందుకే అమ్మను క్షేత్రస్వరూపిణిగా అభివర్ణిస్తున్నట్టు పేర్కొన్నారు. అమ్మ నడక నేర్పితే, నాన్న నడత నేర్పిస్తారని గుర్తు చేశారు. భారతీయ సంస్కృతి సంప్రదాయాలు ఎంతో గొప్పదని, దాన్ని పరిరక్షించేందుకు బేతిరెడ్డి శ్రీనివాస్ వంటి తెలుగు భాషా, సంస్కృతాభిమానులు అక్కడడక్కడా ఉన్నారని, అందుకే బేతిరెడ్డిని ప్రత్యేకంగా అభినందిస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీకళాసుధ తెలుగు అసోసియేషన్ సభ్యులు, పలువురు పుర ప్రముఖులు పాల్గొన్నారు. అంతకుముందు, జ్యోతి ప్రజ్వలనతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇందులో గాయకుడు మహరాజా రాము, పాడుతా తీయగా రన్నరప్ ఎస్.పవిత్రలు ఆలపించిన పాటలు, రోషిణి పెండ్యాల భరత నాట్యం ఆహూతులను ఎంతగానో అలరించాయి. ఈ కార్యక్రమంలో ఆస్కా అధ్యక్షుడు, పల్లవ గ్రానైట్స్ అధినేత కె.సుబ్బారెడ్డి పాల్గొని 'భారతీయం' సత్యవాణిని దుశ్శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమానికి అవధాని ఉప్పలధడియం ఫణిశర్మ వ్యాఖ్యాతగా వ్యవహరించారు.

ప్రధాని పర్యటన వాయిదా

పెరంబూర్, జూన్ 16: కేంద్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేయగా నరేంద్రమోదీ మూడవ సారిగా ప్రధానమంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. ఈ నేపథ్యంలో ప్రధాని మోదీ ఈనెల 20వ తేది రాష్ట్రానికి రానున్నారని ప్రకటన వెలువడింది. స్థానిక ఎగ్మూర్ రైల్వేస్టేషన్ నుంచి నాగర్‌కోయిల్ మధ్య వందే భారత్ రైలు సేవలను ప్రధాని ప్రారంభిస్తారని తెలిసింది. ఈ క్రమంలో, రాష్ట్రానికి ప్రధాని రాక వాయిదా పడిందని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కరు.నాగరాజన్ తెలిపారు. ప్రధాని మోదీ రాష్ట్ర పర్యటన వాయిదా పడడానికి గల కారణాలు తెలియరాలేదు.

అద్దెకు వ్యవసాయ పనిముట్లు

● మంత్రి పెరియకరుప్పన్



పెరంబూర్, జూన్ 16: రాష్ట్రవ్యాప్తంగా 2,938 ప్రాథమిక వ్యవసాయ సహకార రుణ సంఘాల్లో రైతులకు అవసరమైన పనిముట్లు, ట్రాక్టర్, ట్రిల్లర్ తదితర యంత్రాలను అద్దెకు ఇవ్వనున్నట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి పెరియకరుప్పన్ తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఉత్తర్వులతో సాగుకు అవసరమైన ఎరువులు, యూరియా, విత్తనాలు తదితరాలు సిద్ధం చేశామన్నారు. 2,456 సహకార రుణ సంఘాలు, 115 వ్యవసాయ ఉత్పత్తిదారులు, విక్రయ సంఘాల ద్వారా పంట రుణాలు అందజేస్తున్నామని తెలిపారు. వర్షాభావం కారణంగా మేట్టూరులో తగిన నీరు లేకపోవడంతో ఈ ఏడాది నిర్ణీత కాలంలో సాగు నీరు విడుదల చేయలేకపోయామన్నారు. కర్ణాటక అందించాల్సిన కావేరి జలాలు పొందేందుకు న్యాయస్థానాన్ని ఆశ్రయించినట్లు మంత్రి తెలిపారు. ఇక అద్దెకు పనిముట్లు కావాల్సిన రైతులు 'ఉళవర్' యాప్ ద్వారా సందేశం పంపాలన్నారు. ట్రాక్టర్లు, మినీ ట్రాక్టర్లు, నాట్లు వేసే యంత్రాలు, కోత యంత్రాలు, చెరకు కోత యంత్రాలు, ధాన్యాలను నూర్చే యంత్రాలు, డ్రోన్లు, స్ప్రింకర్లను తక్కువ అద్దెకు అందిస్తామని చెప్పారు. ఉళవర్ యాప్‌కు సందేశం పంపిన రైతుల మొబైల్ ఫోన్‌లకు యంత్రాలు కేటాయింపులకు సంబంధించిన మెసేజ్‌లు పంపుతామన్నారు. ఆ తర్వాత రైతులు తమకు సమీప ప్రాంతాల్లో ఉన్న వ్యవసాయ సంఘాల ద్వారా ట్రాక్టర్లు, తదితర పనిముట్లను అద్దెలకు తీసుకెళ్లి, ఉపయోగించిన తర్వాత వాటిని మళ్ళీ వ్యవసాయ సంఘాల అధికారులకు అప్పగించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

విక్రవాండిలో త్రిముఖ పోటీ




డీఎంకే అభ్యర్థి అన్నియూరు శివా - నామ్ తమిళర్ కట్చి అభ్యర్థి డాక్టర్ అభినయా - పీఎంకే అభ్యర్థి సీ అన్బుమణి

చెన్నై, జూన్ 16(ఆంధ్రజ్యోతి): విల్లుపురం జిల్లా విక్రవాండి శాసనసభ నియోజకవర్గం ఉప ఎన్నికను ప్రధాన ప్రతిపక్షమైన అన్నాడీఎంకే, దాని మిత్రపక్షమైన డీఎండీకే బహిష్కరించడంతో ప్రస్తుతం ఆ నియోజకవర్గంలో త్రిముఖ పోటీ నెలకొననుంది. బీజేపీ మిత్రపక్షమైన పీఎంకే మాత్రమే పాలకపక్షమైన డీఎంకేతో తలపడనుంది. నామ్‌తమిళర్ కట్చి పోటీ పడుతుండటంతో ఆ నియోజకవర్గంలో పేరుకు మాత్రమే త్రిముఖమే అయినా పోటీ ప్రధానంగా డీఎంకే, పీఎంకేల మధ్యేనని చెప్పవచ్చు. విక్రవాండి ఉప ఎన్నికల్లో జూలై 10న జరుగనున్నాయి. డీఎంకే తరపున అన్నియూరు శివా, పీఎంకే తరపున సి.అన్బుమణి, నామ్‌తమిళర్ కట్చి తరపున డాక్టర్ అభినయా పోటీపడుతున్నారు. ఈ ఎన్నికలను అన్నాడీఎంకే బహిష్కరించడంతో డీఎంకే మిత్రపక్షాలన్నీ ఆ పార్టీపై విరుచుకుపడుతున్నాయి. బీజేపీతో రహస్య సంబంధాలు కొనసాగిస్తుండటం వల్లే ఆ పార్టీ ఆదేశం మేరకే అన్నాడీఎంకే ప్రధానకార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి ఎన్నికల బహిష్కరణ నిర్ణయం తీసుకున్నారని ధ్వజమెత్తాయి. అయితే అన్నాడీఎంకే నిర్ణయం వల్ల ఎన్డీయే తరపున పోటీ చేయనున్న పీఎంకే అభ్యర్థి అన్బుమణి గెలుపునకు సానుకూలంగా మారగలదని బీజేపీ నేతలు భావిస్తున్నారు. అన్నాడీఎంకే పోటీపడితే డీఎంకే వ్యతిరేక ఓట్లు పీఎంకే, అన్నాడీఎంకే పార్టీలు చీల్చేవని అనుకున్నారు. ప్రస్తుతం అన్నాడీఎంకే పోటీకి దూరం కావటం పీఎంకేకి సానుకూలంగా మారుతుందని బీజేపీ నేతలు అంచనా వేస్తున్నారు.

డీఎంకే ధీమా...

విక్రవాండి ఉప ఎన్నికల్లో డీఎంకే గెలుపు తథ్యమని ఆ పార్టీ అధ్యక్షుడు స్టాలిన్ సహా నాయకులంతా ధీమా వ్యక్తం చేస్తున్నారు. డీఎంకే ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజాసంక్షేమ పథకాల వల్లే లోక్‌సభ ఎన్నికలలో ఘనవిజయం సాధించామని, విక్రవాండి ఓటర్లు కూడా ప్రభుత్వంపై సంతృప్తిని ప్రకటించేలా పార్టీ అభ్యర్థిని గెలిపించడం ఖాయమని చెబుతున్నారు.

చెన్నై తెలుగు అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎంపిక



పెరంబూర్, జూన్16: చెన్నై తెలుగు అసోసియేషన్ (సీటీఏ) నూతన కార్యవర్గ సభ్యుల పరిచయం కార్యక్రమం ఆదివారం జరిగింది. స్థానిక వలసరవాక్కంలోని శ్రీచక్ర ఇన్‌లో సీటీఏ వార్షిక సర్వసభ్య సమావేశం జరిగింది. కార్యక్రమంలో ప్రస్తుత కమిటీ అధ్యక్షుడు కేఆర్కే బాలాజీరావు గత ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆదాయ వ్యయ వివరాలు సమర్పించారు. అనంతరం 2024-26 సంవత్సరానికి సంబంధించిన కొత్త కార్యవర్గ సభ్యుల పరిచయం కార్యక్రమం జరిగింది. నూతన అధ్యక్షుడిగా కడివేటి గోపాలకృష్ణారెడ్డి, సెక్రటరీగా గాడిపర్తి సురేష్, ఉపాధ్యక్షులుగా విజయేంద్రరావు, బి.వెంకయ్యనాయుడు, కోశాధికారిగా నాగరాజు, కల్చరల్ సెక్రటరీగా డా.ఏపీ శివకుమారి, జాయింట్ సెక్రటరీలుగా కె.రంగారెడ్డి, రామయ్య, వెంకటేశ్వర్లు, కమిటీ సభ్యులుగా ఎం.కృష్ణ, సుధాకర్, మధుకర్, కొండస్వామి నాయుడు, శ్రీను బాబు, వెంకట రమణయ్య, రామ్‌ప్రసాద్, రఘునాథ రెడ్డి, అనంత నారాయణన్ తదితరులు ఎంపికయ్యారు.

నేటి నుంచి మళ్లీ పెరగనున్న ఎండలు

చెన్నై, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సోమవారం నుంచి పగటిపూట ఉష్ణోగ్రత మళ్లీ పెరనుందని స్థానిక వాతావరణ పరిశోధన కేంద్రం అధికారులు తెలిపారు. మన్నార్ జలసంధి, దాని పరిసర దక్షిణాది జిల్లాల్లో ఈనెల 29 వరకు సముద్రతీరాల్లో వేడి గాలులు వీయనున్నాయని, గంటలకు 45 కిలోమీటర్ల వేగంతో వీచే ఆ గాలుల వల్ల పగటి పూట ఉష్ణోగ్రత అధికం కానుందని పేర్కొన్నారు. మరో మూడు రోజులపాటు రాష్ట్రంలో వడగాడ్పులు వీస్తాయని, వృద్ధులు, పసిపిల్లలు ఇంటిపట్టునే గడపడం మంచిదని అధికారులు పేర్కొన్నారు.

సమాచార దృష్టి

నేడు మెట్రోరైలు సేవల తగ్గింపు

పెరంబూర్, జూన్ 16: బక్రీద్ పండుగ సందర్భంగా సోమవారం ప్రభుత్వ సెలవు దినం కావడంతో మెట్రో రైళ్లు శనివారం టైంటేబుల్ ప్రకారం నడుస్తాయని చెన్నై మెట్రోరైల్ లిమిటెడ్ (సీఎంఆర్ఎల్) ఒక ప్రకటనలో తెలిపింది. ఆ ప్రకారం, ఉదయం 8 నుంచి 11 గంటలు, సాయంత్రం 5 నుంచి రాత్రి 8 గంటల వరకు 6 నిముషాలకు ఒక రైలు, ఉదయం 5 నుంచి 8 గంటలు, ఉదయం 11 నుంచి సాయంత్రం 5 గంటలు, రాత్రి 8 నుంచి 10 గంటల వరకు 7 నిముషాలకు ఒక రైలు, రాత్రి 10 నుంచి 11 గంటల వరకు 15 నిముషాలకు ఒక రైలు నడుపనున్నట్లు సీఎంఆర్ఎల్ తెలిపింది.

రేపు సీఐటీయూ ఆందోళన

పెరంబూర్, జూన్ 16: రవాణా శాఖలో పనిచేస్తున్న దినసరి కూలీలకు కనీస వేతనం అందించాలని కోరుతూ ఈ నెల 18న సీఐటీయూ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టనున్నారు. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.కనకరాజ్ విడుదల చేసిన ప్రకటనలో... రాష్ట్ర రోడ్డు ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ (ఎస్ఈటీసీ)లో దినసరి కూలీలుగా పనిచేస్తున్న కార్మికులకు ప్రకటించిన రూ.882 కనీస వేతనం ప్రకటించాలి, సొంత ప్రాంతంలో ఖాళీ పోస్టులున్నా కార్మికులకు ఇతర ప్రాంతాల్లో విధులు అందించే విధానం రద్దుచేయాలి సహా పలు డిమాండ్ల సాధనకు ఈ నెల 18వ తేది ఎస్ఈటీసీ శాఖా కార్యాలయాల ఎదుట ఆందోళన చేపట్టనున్నట్లు సీఐటీయూ ప్రకటించింది.

తాంబరం-రామనాథపురం ప్రత్యేక రైళ్లు

పెరంబూర్, జూన్ 16: తాంబరం-రామనాథపురం-తాంబరం మధ్య ప్రత్యేక రైళ్లు నడుపనున్నట్లు దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది. నెం.06051 తాంబరం-రామనాథపురం బై వీక్లీ ఎక్స్‌ప్రెస్ రైలు ఈ నెల 21,23,28,30, జూలై 5,7,12,14,19,21,26,28 తేదీల్లో తాంబరంలో రాత్రి 7 గంటలకు బయల్దేరి మరుసటిరోజు ఉదయం 7.50 గంటలకు రామనాథపురం చేరుకుంటుంది. మరుమార్గంలో, ఎం.06052 రామనాథపురం-తాంబరం ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు ఈ నెల 22,24,29, జూలై 1,6,8,13,15,20,22,27,29 తేదీల్లో రామనాథపురంలో మధ్యాహ్నం 3 గంటలకు బయల్దేరి మరుసటి రోజు వేకువజామున 3.15 గంటలకు తాంబరం చేరుకుంటుంది.

'ఉత్తమ వైద్యుడు' పురస్కారానికి దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, జూన్ 16: వైద్యరంగంలో సేవలందిస్తున్న వైద్యులు పురస్కారానికి దరఖాస్తు చేసుకోవచ్చని తమిళనాడు వైద్య కౌన్సిల్ ఒక ప్రకటనలో తెలిపింది. వైద్యరంగంలో అంకితభావంతో పనిచేస్తున్న ప్రోత్సహించేలా వైద్య కౌన్సిల్ పురస్కారాలు అందజేస్తోంది. 'బెస్ట్ మెడికల్ పర్‌ఫెక్ట్, 'హైయర్ స్పెషలైజేషన్ డిపార్ట్‌మెంట్ అండ్ మొనార్చి', 'కమ్యూనిటీ డాక్టర్ తదితర మూడు విభాగాల్లో పురస్కారాలు అందజేయనున్నారు. వైద్యరంగంలో 15 ఏళ్ల అనుభవం, కేసులు లేని వారు ఈ పురస్కారాలకు అర్హులు. దరఖాస్తులను ఈ నెల 20వ తేది మధ్యాహ్నం 3 గంటల్లోపు https://www.tamilanadumedicalcouncil.org/ అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.

ప్రభుత్వ పాఠశాలలకు 6,890 మంది కంప్యూటర్ శిక్షకుల ఎంపిక

ప్యారీస్, జూన్ 16: రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లోని కంప్యూటర్ ల్యాబ్‌లకు 6,890 మంది శిక్షకులను ఎంపిక చేసినట్లు రాష్ట్రప్రభుత్వం ప్రకటించింది. రాష్ట్రంలోని ప్రభుత్వ మహోన్నత పాఠశాలల్లో తలా 20 కంప్యూటర్లు, ఉన్నత పాఠశాలల్లో 10 కంప్యూటర్లు కలిగిన ఉన్నత శ్రేణి ల్యాబ్‌లు ఏర్పాటయ్యాయి. వీటిని ఐదేళ్లుగా ఎల్ అండ్ టీ సంస్థ పరామర్శిస్తూ వచ్చిన నేపథ్యంలో, ఈ ఒప్పందం ముగిసింది. ఇందువల్ల పాఠశాల విద్యాశాఖ, కంప్యూటర్ టెక్నాలజీ శాఖల నిపుణులు కంప్యూటర్ ల్యాబ్‌లకు అర్హత కలిగిన 6,890 మందిని ప్రాక్టికల్, ఇతర పరీక్షల ద్వారా ఎంపిక చేసింది. వీరికి నెలకు గౌరవ వేతనం, పీఎఫ్, ఈఎస్ఐ ఇతర రాయితీలు సహా రూ.11,452 అందజేయనున్నట్లు అధికారులు తెలిపారు.

వృత్తి శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, జూన్ 16: మెట్రోట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ (ఎంటీసీ)లో ఏడాది వృత్తి శిక్షణకు ఆసక్తి ఉన్న వారు దరఖాస్తు చేసుకోవచ్చు. మెకానికల్, ఆటోమొబైల్, సివిల్, ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ కోర్సులు, సర్టిఫికేట్ కోర్సులను 2020,2021,2022,2023లో ఉత్తీర్ణులైనవారు ఈ శిక్షణకు అర్హులు. ఆసక్తి కలిగిన వారు www.boatsrp.com అనే వెబ్‌సైట్‌లో జూలై 8వ తేదిలోపు దరఖాస్తు చేసుకోవచ్చు.

317 పెంపుడు జంతువులకు లైసెన్స్

పెరంబూర్, జూన్ 16: గృహాల్లో పెంపుడు జంతువులను పెంచుకొనే యజమానులు, తప్పనిసరిగా లైసెన్స్ పొందాలని తాంబరం కార్పొరేషన్ ప్రకటించింది. శునకాలు, పిల్లలు సహా పలు జంతువులు పెంచుకొనేవారు లైసెన్స్ పొందేందుకు దరఖాస్తు చేసుకొనేలా https://tcmcpublichealth.in అనే వెబ్‌సైట్‌ను కార్పొరేషన్ పరిచయం చేసింది. పెంపుడు జంతువుల యజమానులు ఈనెల 20వ తేది వరకు దరఖాస్తు చేసుకోవచ్చని ప్రకటించింది. ఈ నేపథ్యంలో, ఈ వెబ్‌సైట్ ద్వారా శనివారం వరకు 503 దరఖాస్తులు రాగా, వాటిని పరిశీలించి 317 పెంపుడు జంతువులకు లైసెన్స్ మంజూరు చేసినట్లు అధికారులు తెలిపారు.

పవన విద్యుత్ కేంద్రాల ఏర్పాటులో రాష్ట్రానికి పురస్కారం

పెరంబూర్, జూన్ 16: రాష్ట్రంలో గత మార్చి గణాంకాల ప్రకారం పలు ప్రైవేటు సంస్థలు 10,603 మెగావాట్ల పవన విద్యుత్ కేంద్రాలున్నాయి. వాటిలో ఉత్పత్తి అయ్యే విద్యుత్‌ను విద్యుత్ బోర్డు కొనుగోలు చేస్తోంది. ఈ నేపథ్యంలో, కేంద్ర నూతన మరియు పునరుత్పాదక ఇంధన శాఖ ఆధ్వర్యంలో శనివారం ఢిల్లీలో ప్రపంచ పవన దినోత్సవం జరిగింది.ఈ కార్యక్రమంలో, 2023-24 ఆర్థిక సంవత్సరంలో దేశంలో పవన విద్యుదుత్పత్తి కేంద్రాలు ఏర్పాటుచేసిన రాష్ట్రాల్లో తమిళనాడుకు మూడవ బహుమతిని కేంద్ర సహాయ మంత్రి శ్రీపద్ యసోనాయక్, రాష్ట్ర విద్యుత్ బోర్డు అధ్యక్షుడు రాజేష్ లఖానీకి అందజేశారు.

యూట్యూబర్ శంకర్ బ్యాంక్ ఖాతాల స్తంభన

పెరంబూర్, జూన్ 16: యూట్యూబర్ శంకర్ బ్యాంక్ ఖాతాలను సైబర్ క్రైం పోలీసులు స్తంభింపజేశారు. రెడ్ పిక్స్ పేరుతో యూట్యూబ్ ఛానల్‌ను ఫిలిక్స్ జేరాల్డ్ నిర్వహిస్తున్నాడు. ఆయన నెలరోజుల క్రితం యూట్యూబర్ శంకర్ ఇంటర్వ్యూను తమ ఛానల్‌లో ప్రసారం చేశారు. ఆ ఇంటర్వ్యూలో శంకర్, మహిళా పోలీసులపై పలు అసభ్య వ్యాఖ్యలు చేసినట్లు తెలిసింది. ఈ వ్యవహారంలో కోవై పోలీసులు శంకర్, జెరాల్డ్‌పై కేసు నమోదుచేశారు. ఈ నేపథ్యంలో, శంకర్‌కు సొంతమైన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఖాతాలో కొన్ని నెలలుగా రూ.1.25 కోట్ల పరివర్తనలు జరిగాయని సైబర్ క్రైం పోలీసుల విచారణలో తెలిసింది. ప్రస్తుతం ఆ బ్యాంక్ ఖాతా స్తంభింపజేయగా, మరో మూడు ఖాతాలు పరిశీలిస్తున్నట్లు సైబర్ క్రైం పోలీసులు తెలిపారు.

సమాజం పట్ల బాధ్యతగా వ్యవహరించాలి

వాసవీక్లబ్స్ వైస్‌ప్రెసిడెంట్ ఎం.ఎల్ ఉదయకుమార్

ప్యారీస్, జూన్ 15 : వ్యాపారాలైనా, స్వచ్ఛంద సేవకులైనా చివరకు అందరూ సమాజంలో భాగమేనని, జీవన సమాజం పట్ల ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని వాసవీక్లబ్స్ ఇంటర్నేషనల్ చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ వైస్ ప్రెసిడెంట్ ఎం.ఎల్ ఉదయకుమార్ పేర్కొన్నారు. వాసవీ క్లబ్ షావుకారుపేట చెన్నై వనితా క్లబ్ డిస్ట్రిక్టు వి502ఎ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు డాన్ టు డస్ట్-2024 స్ఫూర్తి టీమ్‌చే నగరంలో పేదలకు పలు సేవాకార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా తండయార్‌పేటలోని అంధుల పాఠశాలలో 40 మందికి వాకింగ్ స్టిక్స్, యేడాదికి సరిపోయే కిరాణా సరకులు, రెండు వేల లీటర్ల వాటర్ ట్యాంక్‌లు పంపిణీ చేశారు. అనంతరం సెంట్రల్ రైల్వేస్టేషన్ సమీపంలోని చెన్నై పురి అన్నదానం అనాథ పిల్లల ఆశ్రమంలో విద్యార్థులకు నోటుపుస్తకాలు, విద్యా సామగ్రి పండ్లు, రెండు 1000 లీటర్ల వాటర్ ట్యాంక్‌లు పంపిణీ చేశారు. ఆ తర్వాత వరదాముత్తియప్పన్ వీధిలో ఉన్న నారాయణ గురవయ్య చెట్టి ఛారిటీస్ హాలులో క్లబ్ అధ్యక్షుడు చీమకుర్తి మల్లిఖార్జున రావు - నాగలక్ష్మి దంపతుల అధ్యక్షతన ట్రాఫిక్ పోలీసులను ఘనంగా సత్కరించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంఎల్ ఉదయకుమార్ సమక్షంలో క్లబ్ సభ్యులు నేత్రదానం, అవయవదానం పత్రాలను ప్రభుత్వ ఆసుపత్రి నిర్వాహకులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో డి. త్రిలోక్‌బాబు- పూర్ణిమ, కే ప్రవీణ్‌కుమార్- శివరంజని, ముంజులూరు మురళీమోహన్, ఎస్వీ పద్మనాభన్ తదితరులు పాల్గొన్నారు.



ట్రాఫిక్ పోలీసులను సత్కరిస్తున్న వాసవీక్లబ్ షావుకారుపేట చెన్నై వనితా క్లబ్బుల నిర్వాహకులు

నేడు బక్రీద్

ఇస్లామీయులకు నేతల శుభాకాంక్షలు

ప్యారీస్, జూన్ 16: త్యాగానికి ప్రతీక అయిన బక్రీద్ పండుగను సోమవారం జరుపుకోనున్న ఇస్లామీయులకు సీఎం స్టాలిన్, అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి సహా పలువురు నేతలు వేర్వేరుగా శుభాకాంక్షలు తెలియజేశారు. ముస్లింలు ప్రధాన పండుగలైన రెండింటిలో ఒకటి రంజాన్ కాగా, మరొకటి బక్రీద్. ఇస్లాం క్యాలెండర్ ప్రకారం 12వ నెల జిల్‌హజ్ 17వ తేదీన బక్రీద్ పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారు. ఇస్లాం మతంలోని ఐదు ప్రధాన సూత్రాలైన హజ్ తీర్థయాత్రను రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ముస్లింలు ఇప్పటికే చేపట్టారు. రాష్ట్రప్రభుత్వం హజ్ తీర్థయాత్రకు వెళ్లే వారికి పలు రాయితీలు కూడా కల్పిస్తోంది. అల్లాహ్ ఆదేశాలనుసారం ఇబ్రహీం తన ఏకైక పుత్రుడైన ఇస్మాయిల్‌ను బలివ్వడానికి సిద్ధమైన సంప్రదాయాన్ని స్మరిస్తూ ముస్లింలు ఈ బక్రీద్ పండుగను జరుపుకుంటున్నారు. వీరికి ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్, అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి, ఎండీఎంకే ప్రధాన కార్యదర్శి వైగో, రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు సెల్వపెరుందగై, తమిళ మానీల కాంగ్రెస్ అధ్యక్షుడు జీకే వాసన్, ఏఎంఎంకే నేత టీటీవీ దినకరన్ సహా మరి కొంతమంది మతగురువులు శుభాకాంక్షలు తెలియజేశారు.

కోయంబేడు మార్కెట్లో పెరిగిన కూరగాయల ధరలు

● టమోటా కిలో రూ.60, బీన్స్ రూ.150



కోయంబేడు మార్కెట్లో కొనుగోలుదారులు

పెరంబూర్, జూన్ 16: స్థానిక కోయంబేడు మార్కెట్లో కూరగాయల ధరలు పెరిగాయి. హోల్‌సేల్ మార్కెట్లో టమోటా కిలో రూ.60, బీన్స్ రూ.150, మునక్కాయలు రూ.70 వరకు పెరిగాయి. రాష్ట్రంలో గత ఏప్రిల్, మే నెలల్లో ఎండ తీవ్రత అధికంగా ఉండగా, అనంతరం వేసవి వర్షాలు కురిశాయి. దీంతో కోయంబేడు మార్కెట్‌కు టమోటా దిగుమతులు తగ్గాయి. కొద్దిరోజుల క్రితం టమోటా కిలో రూ.24 ఉండగా, క్రమంగా పెరుగుతూ ఆదివారం రూ.60కి పెరిగింది. ఇక, ట్రిప్లికేన్, జామ్ బజార్, అరుంబాక్కం, టీనగర్ తదితర చిల్లర మార్కెట్లో కిలో రూ.80 వరకు, వ్యాసర్పాడి, కొడుంగైయూర్ తదితర ప్రాంతాల్లో మూడవ రకం చిన్న టమోటా రూ.60 వరకు విక్రయమైంది. అలాగే, కోయంబేడు మార్కెట్లో కొద్దిరోజుల క్రితం మునక్కాయలు రూ.20 ధర పలుకగా ప్రస్తుతం రూ.70కి పెరిగింది. అలాగే, ముల్లంగి రూ.25 నుంచి రూ.50, అవరకాయ రూ.20 నుంచి రూ.80, బెండకాయలు రూ.20 నుంచి రూ.30, బీన్స్ రూ.70 నుంచి రూ.150, పొట్లకాయ రూ.15 నుంచి రూ.30, క్యాబేజీ రూ.12 నుంచి రూ.14 వరకు పెరిగాయి. ఇక, పచ్చి మిర్చి రూ.50, చిన్న ఉల్లి, క్యారట్ తలా రూ.40, బంగాళాదుంపలు రూ.29, బీట్‌రూట్ రూ.25, పెద్ద ఉల్లి రూ.23 ధరలు మార్పు లేకుండా పాత ధరకే విక్రయమయ్యాయి.

విక్రవాండి ఉప ఎన్నికలో పోటీచేయం : డీఎండీకే

పెరంబూర్, జూన్ 16: విక్రవాండి శాసనసభ ఉప ఎన్నికలో అన్నాడీఎంకే తర్వాత డీఎండీకే కూడా బహిష్కరిస్తున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రేమలత ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో... జూలై 10వ తేది జరగాల్సిన విక్రవాండి ఉపఎన్నికలో పోటీచేయడం లేదని తెలిపారు. ఎన్నికలు ప్రజాస్వామ్యబద్ధంగా స్వేచ్ఛగా జరగాలన్నారు. ప్రస్తుత ఎన్నికలు అధికార బలం, ధనబలంతో కూడుకున్నదన్నారు. ఇలాంటి ఎన్నికల్లో పోటీచేసి అవసరంగా డబ్బులు వృథా చేసేందుకు తాము ఇష్టపడడం లేదన్నారు.

డ్రైవర్లు, కండక్టర్లు యూనిఫాం ధరించాలి

పెరంబూర్, జూన్ 16: విధి నిర్వహణలో డ్రైవర్లు, కండక్టర్లు యూనిఫాం, బాడ్జీ తప్పనిసరిగా ధరించాలని మెట్రోట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్(ఎంటీసీ) ఉత్తర్వులు జారీచేసింది. ఈ మేరకు అన్ని డిపోల మేనేజర్లకు ఎంటీసీ మేనేజింగ్ డైరెక్టర్ సర్క్యులర్లు పంపారు. విధుల్లో ఉన్న డ్రైవర్లు, కండక్టర్లు యూనిఫారం, బాడ్జీలు ధరించడం లేదని ఫిర్యాదులందాయన్నారు. విధుల్లో ఉన్న డ్రైవర్లు, కండక్టర్లు యూనిఫాం, బాడ్జీ తప్పనిసరిగా ధరించేలా మేనేజర్లు పర్యవేక్షించాలని సర్క్యులర్‌లో ఆదేశించారు.



లోక్‌సభ ఎన్నికల్లో నెల్లూరు నుంచి గెలుపొందిన టీడీపీ నేత వేమిరెడ్డి ప్రభాకరరెడ్డిని ఆదివారం మర్యాదపూర్వకంగా కలుసుకుని శుభాకాంక్షలు తెలుపుతున్న ఆంధ్రాక్లబ్ మేనేజింగ్ ట్రస్టీ శ్రీనివాసులు రెడ్డి

పోటీ నుంచి అన్నాడీఎంకే తప్పుకోవడం మా మొదటి గెలుపు

మంత్రి ఎమ్మార్కే పన్నీర్‌సెల్వం

పెరంబూర్, జూన్ 16: విక్రవాండి ఉప ఎన్నికలో ఓటమి తప్పదని గ్రహించిన అన్నాడీఎంకే, శాంతిభద్రతలు చూపి ఎన్నిక బహిష్కరిస్తున్నట్లు ప్రకటించడం హాస్యాస్పదంగా ఉందని మంత్రి ఎమ్మార్కే పన్నీర్‌సెల్వం ఎద్దేవా చేశారు. కడలూరు జిల్లా కాట్టుమన్నార్‌కోయిల్ సమీపం మట్టం గ్రామానికి చెందిన చిన్నదురై ఇటీవల కువైట్‌లో జరిగిన అగ్నిప్రమాదంలో మృతిచెందారు. ఆయన కుటుంబానికి రాష్ట్రప్రభుత్వం ప్రకటించిన ఆర్థికసాయాన్ని ఆదివారం మంత్రి అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... ప్రవాస తమిళుల సంక్షేమానికి సీఎం స్టాలిన్ నేతృత్వంలోని డీఎంకే ప్రభుత్వం పాటుపడుతుందన్నారు. ముఖ్యమంత్రి ప్రత్యేక చర్యల కారణంగా కువైట్‌లో మృతిచెందిన వారి మృతదేహాలు సత్వరం స్వగ్రామాలకు తెప్పించి, ప్రభుత్వం ఆధ్వర్యంలో అంత్యక్రియలు నిర్వహించామన్నారు. అలాగే, మృతుల కుటుంబాలకు సత్వరం ఆర్థికసాయం అందించామని తెలిపారు. విక్రవాండి ఎన్నికల్లోనూ డీఎంకే విజయం తథ్యమని మంత్రి జోస్యం చెప్పారు.

శశికళ ఇంటి ఎదుట పోస్టర్ల కలకలం



పోయెస్‌గార్డెన్‌లోని శశికళ నివాసం వద్ద కలకలం రేపుతున్న పోస్టర్

చెన్నై, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే మాజీ ముఖ్యమంత్రి జయలలిత సన్నిహితురాలు శశికళ పార్టీలో విడిపోయిన వర్గాలను కలిపేందుకు ప్రయత్నించేలా ఆదివారం సాయంత్రం పార్టీ శ్రేణులతో భేటీ అయ్యారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ఆమె అనుచరులైన పార్టీ నిర్వాహకులు పోయెస్‌గార్డెన్ వద్ద పోస్టర్లు అతికించారు. ఆ పోస్టర్లలో శశికళను అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి అంటూ ముద్రించడం అన్నాడీఎంకే వర్గాలలో ఆగ్రహం తెప్పించాయి. అంతేకాక 2026లో జరుగనున్న శాసనసభ ఎన్నికల్లో 234 నియోజకవర్గాలలో గెలుపు మనదే అంటూ ముద్రించడం కూడా కలకలం సృష్టిస్తోంది.

కావేరి మాతకు రైతుల ప్రత్యేక పూజలు



కావేరి మాతకు పూజలు జరుపుతున్న అన్నదాతలు

చెన్నై, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ పంటలను పండించడానికి సాగుజలాల కోసం అన్నదాతలు కావేరి మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కావేరి డెల్టా జిల్లాలకు ప్రతి యేటా జూన్ 12న మేట్టూరు డ్యామ్ నుండి జలాలను విడుదల చేయటం ఆనవాయితీ. అయితే ఈ యేడాది కర్నాటక నుండి కావేరి జలాలు ఆశించినంత మేరకు విడుదల కాకపోవడంతో మేట్టూరు డ్యామ్‌లో నీరడుగంటింది. దీనితో ఈ నెల 12న మేట్టూరు డ్యామ్ నుండి సాగు జలాలను ప్రభుత్వం విడుదల చేయలేకపోయింది. దీనితో రైతులు ఖరీఫ్ పంటలను సాగుచేయలేని దుస్థితి దాపురించింది. ప్రస్తుతం బోరు బావుల నీటి ద్వారా పంటల సాగుచేయడానికి రైతులు సిద్ధమవుతున్నారు. ఈ పరిస్థితులలో మేట్టూరు జలాల ద్వారా కావేరి జలాలు విడుదలయ్యేలా తంజావూరు జిల్లా తిరువయ్యారు పుష్యమండపం ఘాట్ సమీపంలో కావేరి మాతకు రైతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కావేరి మాత సేంద్రీయ వ్యవసాయ రైతుల సంఘం, కావేరి డెల్టా రైతుల సంఘం, తంజావూరు ధాన్యాగార రైతు సంఘాల సమాఖ్య సంయుక్త ఆధ్వర్యంలో ఈ పూజలు నిర్వహించారు. పాత వరివంగడమైన 'మాప్పిళ్లై సంబా' నార్లతో 'కావేరి తాయ్' (కావేరి మాత) అని తమిళ అక్షరాల మాదిరిగా నాట్లు నాటి పూజించారు. ఆ తర్వాత అందరూ కలిసి దీపారాధన కూడా చేశారు. వీలయినంత త్వరగా కర్నాటక నుండి కావేరి జలాలు విడుదలై, మేట్టూరు డ్యామ్ నీటితో నిండి సాగు జలాలు విడుదల కావాలని కావేరి మాతను తలచుకుని రైతులంతా ప్రార్థించారు.

నాకు కుల పట్టింపులు లేవు : శశికళ

చెన్నై, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి జయలలితలాగే తనకు కులపట్టింపులు లేవని ఆమె సన్నిహితురాలు శశికళ ప్రకటించారు. ఆదివారం సాయంత్రం పోయెస్ గార్డెన్ వద్ద ఆమె విలేఖరులతో మాట్లాడుతూ ప్రస్తుతం పార్టీలో జరుగుతున్నందంతా గమనిస్తూనే ఉన్నానని చెప్పారు. అన్నాడీఎంకే వ్యవస్థాపకుడు ఎంజీఆర్‌తో కూడా తనకు సన్నిహిత సంబంధాలు ఉండేవని, ఆయన ఎన్నో విషయాలను తనతో చర్చించేవారని తెలిపారు.తానెప్పుడూ కుల మతాలను పట్టించుకోనని, జయలలితకు కూడా కులపట్టింపులు లేవని, అందరితోనూ సమానంగా వ్యవహరించేవారని చెప్పారు.ప్రస్తుతం కొంతమంది స్వార్థపరుల వల్ల పార్టీ ప్రతిష్ట దిగజారుతోందని చెప్పారు. అన్నాడీఎంకేలో ఓ రుపేద కూడా ఎమ్మెల్యే, ఎంపీ కాగాలరని అయితే డీఎంకేలో అలాంటి పరిస్థితులు ఉండవన్నారు. డీఎంకేలో అందరూ శ్రమించినా కీలక పదవులను అనుభవించేది స్టాలిన్ కుటుంబీకులేనని చెప్పారు. ప్రస్తుతం అన్నాడీఎంకేలో కొన్ని కులాలవారికే అధిక ప్రాధాన్యత ఇస్తుండడం విచారకరమని చెప్పారు. తనకు కులపట్టింపులు గనుక ఉండి ఉంటే ఎడప్పాడిని ముఖ్యమంత్రిగా చేసేదాన్ని కాదనని పేర్కొన్నారు. డీఎంకే తర్వాత ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న అన్నాడీఎంకే ద్వితీయస్థానంలో ఉండాలని, లోక్‌సభ ఎన్నికలలో తృతీయ స్థానానికి దిగజారిపోయిందన్నారు. ప్రస్తుతం పార్టీలో తన ప్రవేశం జరిగిపోయిందని, ఇక పార్టీ నాశనమవుతుందని ఎవరూ చెప్పలేరని పేర్కొన్నారు.

రేపు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెరంబూర్, జూన్ 16: విద్యుత్ మార్గాల్లో చేపట్టనున్న మరమ్మతుల కారణంగా పలు ప్రాంతాల్లో మంగళవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

రాధానగర్: నాయుడు షాప్ రోడ్డు, గణపతి పురం కొంత భాగం, చర్చ్ రోడ్డు, పంచాయతీ మార్కెట్

ముడిచూర్: మదనాపురం, కలైంజర్ వీధి, ముడిచూర్ మెయిన్ రోడ్డు, ఎస్కే అవెన్యూ, కేకే రోడ్డు, ముత్తుమారియమ్మన్ ఆలయ వీధి, స్వామి నగర్, వెంకటాద్రి నగర్, ఏఎల్ఎస్ గ్రీన్ లాండ్, బాలాజి నగర్, ఈబీ కాలని, భరత్ నగర్, లింగం నగర్

న్యూ కాలని: జీఎస్‌టీ రోడ్డు, ఛాంబర్స్ కాలని 1 నుంచి 11 వీధులు, శాస్త్రి కాలని 1 నుంచి 3 వీధులు, ఆర్పీఐ కాలని చోళవరం నగర్, తిరుప్పూర్ కుమరన్ వీధి, ముత్తు వీధి, నల్లతంబి వీధి, రంగసామి వీధి, నవమణి వీధి

పమ్మల్: కలైంజర్ రోడ్డు, అన్నానగర్ 2,3,4 మెయిన్ రోడ్డు, అన్నానగర్ 1 నుంచి 7వ క్రాస్ వీధులు, లక్ష్మీనారాయణ నగర్ 1 నుంచి 4 వీధులు, ఎస్పీఐ కాలని 1వ వీధి

క్రోంపేట: సుబ్బరాయ నగర్, జైన్ హౌసింగ్, రంగానగర్ (తిరునీర్‌మలై రోడ్డు ప్రాంతం), పార్వతి పురం, భారతీయార్ వీధి, ఎస్ఎస్కే వీధి, కాశి గార్డెన్, టెంపుల్ టౌన్ రోడ్డు, మహాలక్ష్మి స్కూల్ ప్రాంతం. **అనకాపుత్తూర్:** గణపతి నగర్, సిలపాదికారన్ వీధి, శ్రీనివాసపురం,లక్ష్మీనగర్, విశ్వాసపురం, మణిమేఘలై వీధి, మసూదివీధి, సెన్‌తమిళ్ రోడ్డు. **హస్తినాపురం:** తిరుమలై నగర్, వినోభాజీ నగర్, సరస్వతి నగర్, గాయత్రి నగర్, లక్ష్మీ నగర్. **మేడవాక్కం:** వానతురై అపార్ట్‌మెంట్ కలైంజర్ నగర్, సౌమ్య నగర్, ముత్తు వీధి, ఆర్ఎం వీరప్పన్ వీధి, బాలాజి నగర్, డైమండ్ కాలని, పెరియార్ నగర్, గజేంద్ర నగర్, వీరభద్రన్ నగర్, వైష్ణవి నగర్, రామ్ గార్డెన్

పల్లికరనై: అస్సాం భవన్, ఒడిస్సా భవన్, హెచ్ఎల్ఎల్ హెచ్‌టీ వీధి, కామాక్షి హాస్పిటల్, మైలైబాలాజి నగర్ పార్ట్ 1 నుంచి 4 వరకు, తందైపెరియార్ నగర్, శ్రీనివాస నగర్, సిలికాన్ టవర్, జాస్మిన్

పల్లావరం: మీనాక్షి నగర్, జీఈసీ పమ్మల్, తిరునీర్‌మలై, ఎల్ఆర్సీ, దర్గా రోడ్డు, త్రిశూలం, కిలకట్టలై, రాజై నగర్, కట్టబొమ్మన్ నగర్, థెరెస్సా స్కూల్ ఆర్కేవీ అవెన్యూ, పాండ్స్ బ్రిడ్జి

చిట్లపాక్కం: వేళచ్చేరి రోడ్డు కొంత భాగం, రామకృష్ణాపురం, ఈశ్వరి నగర్, కామరాజ్ వీధి

సేలయూర్: మాదంబాక్కం, కన్నన్ నగర్, పడువేన్‌చేరి కొంత భాగం, పెరియార్ నగర్, ముల్లైనగర్, పరసువానత్ అవెన్యూ, ఏఎస్కే నగర్, అంబాళ్ నగర్, గాంధీ నగర్, యశ్వంత్ నగర్, భువనేశ్వరి నగర్, పద్మావతి నగర్, మల్లీశ్వరి నగర్, జలవాయి విహార్, ఆండాళ్ నగర్

వెస్ట్ తాంబరం: కిష్కింధ మెయిన్ రోడ్డు, కన్నడపాలయన్, సర్వీస్ రోడ్డు (సాయి నగర్), వసంతం నగర్, సమత్తువ పెరియార్ నగర్, ఆర్కే నగర్, అన్నై ఇందిరా నగర్

కడప్పేరి: తిరునీర్‌మలై రోడ్డు, సుందరం కాలని, రమేష్ నగర్, పిళ్లయార్ ఆలయ వీధి, అమర్ నగర్, రైల్ నగర్, సింగారవేలన్ వీధి

సెంబాక్కం: ఎస్పీఐ కాలని, వీటీసీ వీధి, కామరాజపురం మెయిన్‌రోడ్డు, భవంతి వీధి, శివాలయ వీధి

నెహ్రూ నగర్: కడప్పేరి, చిట్లపాక్కం మొదటి మెయిన్ రోడ్డు, రంగనాథన్ వీధి, సుబ్రమణియన్ వీధి, రామచంద్రన్ రోడ్డు, పద్మనాభ రోడ్డు, అయ్యసామి వీధి, జ్యోతి నగర్, శ్రీనివాస నగర్

రాధానగర్: సన్నిధి వీధి, నాగాత్తమ్మన్ ఆలయ వీధి, సుగుణ కాలని, మనినాయకర్ వీధి, గణపతి పురం మెయిన్ రోడ్డు, 200 అడుగుల రోడ్డు, టీవీఎస్ ఎమరాల్డ్, అగ్ని ఫ్లాట్స్

రోడ్డు ప్రమాదాల్లో చెన్నై మహిళ సహా ముగ్గురి మృతి

ప్యారీస్, జూన్ 16: తెన్‌కాశి జిల్లాలో జరిగిన రెండు రోడ్డు ప్రమాదాలలో చెన్నై మహిళ సహా ముగ్గురు మృతిచెందారు. ఏడుగురికి గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు ఆవడి అన్ననూరుకు చెందిన వెంకటేశ్వరన్ భార్య హేమలత (60) కుమారుడు మాధవన్ (29), అదే ప్రాంతానికి చెందిన తంగరాజన్ (35) ఆయన భార్య పూంగొడి (30), వీరి కుమారులు సెల్వన్, మోహితం, వెంకటేశన్ భార్య శశికళ, కుమార్తె కావ్య తదితరులు శనివారం కారులో విహారయాత్రగా కుట్రాలంకు వెళ్లారు. అక్కడున్న జలపాతాల్లో ఉత్సాహంగా స్నానం చేసి అర్ధరాత్రి తిరుగుముఖం పట్టారు. వారు ప్రయాణం చేసిన కారు తెన్‌కాశి జిల్లా పులియాంగుడి ప్రాంతంలో ఎదురువైపు నుంచి లోడుతో వచ్చిన లారీ వేగంగా కారును ఢీకొంది. ఇందులో కారు ముందు భాగం నుజ్జునుజ్జుకాగా, అందులో ప్రయాణం చేసిన వారికి తీవ్రగాయాలయ్యాయి. ఇది చూసిన ఆ మార్గంలో వెళుతున్న వారు తెలియజేసిన సమాచారంతో అక్కడకు చేరుకునన చొక్కంబట్టి పోలీసులు క్షతగాత్రులను తెన్‌కాశి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే చికిత్స ఫలించక హేమలత ఆదివారం ఉదయం మరణించగా, మిగతా వారు చికిత్సలందుకుంటున్నారు. అదే విధంగా విరుగునగర్ జిల్లా శ్రీవిల్లిపుత్తూర్ అగ్రహారం వీధికి చెందిన కాళిముత్తు కుమారుడు భాస్కర్ (36), మిలటరీలో పనిచేస్తూ సెలవుల్లో ఇంటికొచ్చాడు. ఆయన తనతో కళాశాలలో చదువుతున్న మారిముత్తు (33), కృష్ణరాజ (36)లతో కలసి కుట్రాలం వెళ్లి కారులో తిరిగొస్తూ ఆదివారం తెల్లవారుజామున పులియాంగుడి హైవేలో వెళుతూ రోడ్డు మధ్య ఉన్న డివైడర్‌ను ఢీకొనడంతో కారు నుజ్జునుజ్జయింది. ఇందులో భాస్కర్, కృష్ణరాజులు అక్కడికక్కడే మరణించినట్లు పోలీసుల విచారణలో తెలిసింది.

నీటితొట్టెలో పడి ...

ప్యారీస్, జూన్ 16: స్థానిక ఎలిఫెంట్ గేట్ సమీపంలోని కొండితోపు ప్రాంతంలో నీటితొట్టెలో జారిపడిన చిన్నారి మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. కొండితోపు టెలిగ్రామ్ వీధిలో కొత్తగా నిర్మిస్తున్న భవన నిర్మాణం పనుల్లో ఒడిస్సా రాష్ట్రానికి చెందిన కార్మికులు కుటుంబాలతో విధుల్లో పాల్గొంటున్నారు. శనివారం కృష్ణన్ దంపతులు పనుల్లో ఉన్న సమయంలో అక్కడ ఆడుకుంటున్న వారి ఐదేళ్ల కుమార్తె కనిపించలేదు. దీంతో చుట్టుపక్కల గాలించినా జాడతెలియక పోవడంతో నిర్మాణపనులు జరుగుతున్న ప్రాంతంలో ఉన్న నీటితొట్టెను గాలించగా అందులో చిన్నారి శవమై కనిపించింది. ఫిర్యాదు మేరకు సెవెన్‌హిల్స్ పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

బాణసంచా కర్మాగారంలో అగ్నిప్రమాదం

● ఒకరి మృతి, ఇద్దరికి గాయాలు

పెరంబూర్, జూన్ 16: తిరువారూర్ జిల్లా మన్నార్‌గుడిలో ఉన్న ప్రైవేటు నాటు టపాసుల కర్మాగారంలో ఆదివారం జరిగిన అగ్నిప్రమాదంలో కర్మాగారం యజమాని కుమారుడు మృతిచెందాడు. మన్నార్‌గుడి తామరైకుళం వడకరైకు చెందిన మనోహరన్-విజయలక్ష్మి దంపతుల పెద్దకుమారుడు సెల్వకుమార్‌కు నాటు టపాసుల తయారీ కర్మాగారం మాతా ఆలయ వీధిలోని కర్తనాథపురంలో ఉంది. ఈ కర్మాగారం పైకప్పు తగరపు రేకులతో ఏర్పాటుచేశారు. ఒక గదిలో టపాసుల తయారీ, మరో గదిలో వాటిని నిల్వ చేస్తుంటారు. ఆదివారం సెలవు కావడంతో మనోహరన్ కుమారులు సతీష్‌కుమార్(35),అరుణ్‌కుమార్(19) మాత్రమే పనిచేస్తున్నారు. టపాసుల మిశ్రమాలు కలుపుతున్న సమయంలో అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో సతీష్‌కుమార్, అరుణ్‌కుమార్‌లకు తీవ్రగాయాలయ్యాయి. చుట్టుపక్కల వారు వారిని రక్షించి మన్నార్‌గుడి ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లగా, అక్కడ చికిత్సలు ఫలించక సతీష్‌కుమార్ మృతిచెందాడు. ఈ ఘటనపై స్థానిక పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

పెయింట్ గోదాములో భారీ అగ్ని ప్రమాదం

చెన్నై, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): నగర శివారు ప్రాంతమైన మనలి పుదునగర్ సమీపంలో ప్రైవేటు సంస్థకు చెందిన పెయింట్ గోదాములో ఆదివారం మధ్యాహ్నం సంభవించిన భారీ అగ్ని ప్రమాదంలో లక్షలు విలువచేసే పెయింట్లు, రసాయనాలు కాలిబూడిదయ్యాయి. ఆ ప్రాంతంలో దట్టమైన పొగలు వ్యాపించడంతో స్థానికులు ఇబ్బందులకు గురయ్యారు. ఈ సమాచారం తెలుసుకుని అగ్నిమాపక దళం సభ్యులు హుటాహుటిన అక్కడికి వెళ్ళి మంటలను అదుపులోకి తెచ్చారు. మంటలు వ్యాపించకుండా గదులలో ఉన్న పెయింట్ నిల్వలను అగ్నిమాపక సిబ్బంది తొలగించారు. ఈ ఘటనపై మనలి పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ జరుపుతున్నారు.

అవినాశి ఆసుపత్రిలో మంత్రి తనిఖీ

చెన్నై, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): కో యంబత్తూరు జిల్లా అవినాశి ప్రభుత్వ ఆసుపత్రిలో ఆదివారం ఉదయం ఆరోగ్యశాఖ మంత్రి ఎం. సుబ్రమణ్యం తనిఖీలు చేశారు. శనివారం రాత్రి కోయంబత్తూరులో డీఎంకే కూటమి విజయోత్సవంలో పాల్గొన్న ఆయన ఆదివారం ఉదయం అవినాశిలో వాకింగ్‌కు వెళుతూ ఆ ఆసుపత్రికి వెళ్లారు. ఆసుపత్రిలోని మందుల దుకాణం, మహిళా వార్డు, పురుషుల వార్డులలో రోగులకు అందిస్తున్న చికిత్సలు గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఆ ఆసుపత్రి ప్రాంగణంలో జరుగుతున్న కొత్త భవనాల నిర్మాణ పనులను కూడా ఆయన పరిశీలించారు.

తిరునల్వేలి రైల్వేస్టేషన్‌కు బాంబు బెదరింపు

● ఒకరి అరెస్టు

చెన్నై, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): తిరునల్వేలి రైల్వేస్టేషన్‌లో బాంబులు పేలనున్నట్లు ఫోన్ చేసి బెదరించిన వ్యక్తిని రైల్వే పోలీసులు అరెస్టు చేశారు. ఆదివారం మధ్యాహ్నం ఆ రైల్వేస్టేషన్ మాస్టర్‌కు గుర్తుతెలియని వ్యక్తి ఫోన్ చేసి బాంబులు పేలనున్నట్లు బెదిరించాడు. వెంటనే స్టేషన్‌మాస్టర్ రైల్వే భద్రతా దళం ఉన్నతాధికారులకు ఆ విషయాన్ని ఫిర్యాదు చేశారు. దీనితో బాంబ్ స్క్వాడ్ నిపుణులు, పోలీసు జాగిలాలను తెప్పించి రైల్వే పోలీసులు స్టేషన్ అంతటా తనిఖీలు చేశారు.చివరకు అది ఉత్తుత్తి బాంబు బెదరింపేనని తెలుసుకున్నారు. ఆ తర్వాత బాంబు బెదరింపు కాల్ చేసిన వ్యక్తి తిరునల్వేలి వన్నారపేటకు చెందిన శివపెరుమాళ్‌గా కనుగొన్నారు. వెంటనే రైల్వే పోలీసులు వన్నారపేటకు వెళ్లి అతడిని అరెస్టు చేశారు.పోలీసులు విచారణలో శివపెరుమాళ్ మద్యం మత్తులో బాంబు బెదరింపు కాల్ చేసినట్లు కనుగొన్నారు.

ఫీనిక్స్ షాపింగ్ ఫెస్టివల్ ప్రారంభం



ఫీనిక్స్ షాపింగ్ ఫెస్టివల్ ప్రారంభోత్సవ దృశ్యం

అడయార్, జూన్ 16: స్థానిక వేళచ్చేరిలోని ఫీనిక్స్ మాల్‌లో 'ఫీనిక్స్ షాపింగ్ ఫెస్టివల్-2024' ప్రారంభమైంది. ప్రముఖ పాకశాస్త్ర నిపుణురాలు, సెలెబ్రిటీ చెఫ్ సారా టాడ్ ఆధ్వర్యంలో ఈ ఫెస్టివల్‌ను నిర్వహిస్తున్నారు. ఇందులో ఆమె స్వయంగా తయారు చేసిన వివిధ రకాలైన పాస్తా, ఇతర భారతీయ వంటకాలను అందుబాటులో ఉంచారు. ప్రారంభోత్సవంలో దాదాపు రెండు వందల మందికిపైగా మహిళలు ఎంతో ఉత్సాహంతో పాల్గొన్నారు. ఆస్ట్రేలియన్ సెలబ్రిటీ చెఫ్, మోడల్, రెస్టారెంట్, కుక్‌బుక్ రచయిత మూడు సిగ్నేచర్ డిష్‌లను తయారు చేశారు. వీటిలో ప్రాన్ పార్స్ విత్ స్పైసెస్, కాన్పిట్ ప్రాన్ చాట్ మసాలా సల్సా, స్పైస్డ్ ప్రాన్‌బ్లాంక్ ఉన్నాయి. ఈ సందర్భంగా సారా టాడ్ మాట్లాడుతూ, భారత్‌తో తనకున్న అనుబంధం వంటల తయారీలో బాగా ప్రభావితం చేసిందన్నారు.

అంతర్జాతీయ స్థాయిలో 'అమృత' విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులతో అళగప్ప వర్శిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ జి.రవి, అమృత చైర్మన్ భూమేనాథన్

పెరంబూర్, జూన్ 16: 'చెన్నై అమృత' విద్యార్థులు అంతర్జాతీయ పోటీల్లో పతకాలు సాధించారు. స్థానిక హైయత్ రెసిడెన్సీలో జరిగిన 'ఎక్స్‌పో కులినరీ-27' పోటీల్లో అమృత విద్యార్థులు గోల్డన్ గర్ల్ శ్రీయా అనీష్, అమృత పి.సదన్‌లు రెండు బంగారు పతకాలు సాధించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న అళగప్ప యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్.జి.రవి, పతకాలు సాధించిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో అమృత చైర్మన్ ఆర్.భూమేనాథన్ మాట్లాడుతూ... ఇటీవల జర్మనీలోని స్టట్‌గార్డ్‌లో జరిగిన 22 దేశాలు పాల్గొన్న కులనరీ ఒలింపిక్స్ తమ సంస్థ విద్యార్థులు మూడు బంగారు పతకాలు, 6 వెండి పతకాలు, ఒక కాంస్య పతకం సాధించారని తెలిపారు. అలాగే, యూఏఈ, ఆఫ్రికాలో జరిగిన అంతర్జాతీయ పోటీల్లో కూడా తమ విద్యార్థులు బంగారు, వెండి, కాంస్య పతకాలు సాధించారని భూమేనాథన్ తెలిపారు.



నాన్నే రోల్ మోడల్

'పితృదేవోభవ' అంటూ తండ్రిని దైవంతో సమానంగా భావించే సంస్కృతి మనది. తండ్రిని సర్వ దేవతామయంగా నిర్వచించాయి పురాణాలు. తండ్రిని సేవించడం పరమ ధర్మమని ఘోషించాయి. తండ్రి సేవలో తరిస్తే ఇహలోకంలో కీర్తిప్రతిష్ఠలు, పరలోకంలో మోక్షం సిద్ధిస్తాయని తెలిపాయి. తండ్రి ఆజ్ఞను పాలించి తనయుడు శ్రీరాముడు అడవి బాట పట్టాడు. తల్లిదండ్రుల సేవలో తరించాడు శ్రవణ కుమారుడు. పుట్టిన నాటి నుండి తండ్రి సంరక్షణలో పెరిగి తండ్రినే ఆదర్శంగా, మార్గదర్శిగా భావిస్తారు పిల్లలు. తల్లిదండ్రులతో జీవితాంతం మెలిగే మనకు మాతృదినోత్సవాలు, పితృదినోత్సవాలు కొత్తగా అనిపించినా, పాశ్చాత్య సంస్కృతీ ప్రభావంతో మనం కూడా వాటిని అమలు చేస్తూ ఆర్భాటంగా జరుపుకుంటున్నాము. అయితే విదేశీయులు ఏడాదికి ఒక్కరోజే తండ్రికి కేటాయించి ఆ రోజు తండ్రిని గుర్తుచేసుకుంటూ, కానుకలర్పిస్తూ కృతజ్ఞతలు తెలియజేస్తే, మనం ఏడాది పొడుగునా, జీవితాంతం తండ్రిని గౌరవిస్తూ, పితృదినోత్సవం రోజు మరింత ఘనంగా వారిని సన్మానించి, వారికి ఆనందం కలగజేస్తుంటాం.

- వేళచ్చేరి

ఫాదర్స్ డే ఎప్పుడు, ఎలా మొదలైంది...

1910లో సోనారా అనే అమెరికా మహిళ తల్లి లేని తనను, ఆ లోటు తెలీకుండా పెంచి పెద్దచేసిన తండ్రి గౌరవార్థం అతని పుట్టినరోజును (జూన్ 19) పితృదినోత్సంగా నిర్వహించింది. అది చూసి అమెరికాలో ఎన్నో ప్రాంతాల్లో పలువురు యీ దినోత్సవం జరపడం ప్రారంభించారు. 1924లో అప్పటి అమెరికా అధ్యక్షుడు జూన్ మూడో ఆదివారాన్ని పితృదినోత్సవంగా ప్రకటించారు. ప్రపంచవ్యాప్తంగా 52 దేశాలు తండ్రుల గౌరవార్థం ఈ పితృదినోత్సవాన్ని పాటిస్తున్నాయి. పిల్లలను బాధ్యతాయుతంగా పెంచి పెద్ద చేసే తండ్రికి ఏమిచ్చినా రుణం తీరదని, ఆ తండ్రి సేవలను గుర్తుచేసుకునేందుకు ఇది ఒక అద్భుత అవకాశంగా ఎంచి నాన్నల వందన దినోత్సవం జరుపుతున్నారు. సొంత తండ్రేకాకుండ, తన ఎదుగుదలకు తోడ్పడిన పెదనాన్నలు, చిన్నాన్నలు మొదలైన వారు కూడా యీ కోవలోనే వస్తారు.

మొదటి నుండి సమాజంలో 'నాన్న' అంటే భయపడాలి. భయపెట్టేవాడుగా నాన్నని చిత్రీకరించారు. అల్లరి చేస్తే నాన్నతో చెబుతాను, అంటూ చిన్నప్పటి నుండే 'నాన్నను' విలన్‌గా దృశ్యీకరించారు. నాన్న మనసు నిండా ప్రేమ ఉన్నా, పొగడ్తలతో పిల్లలను ఆకాశానికి ఎత్తి అందలం ఎక్కించడు...అహంకారంతో తల ఎగరేయనీయడు... ఆత్మవిశ్వాసంతో తల ఎత్తుకొనేలా చేస్తాడు అదీ... నాన్నంటే.

నాన్న ప్రాధాన్యత...

జీవితంలో నాన్నకు ఎంతో ప్రాధాన్యత ఉంది. కుటుంబ బరువు బాధ్యతలు మోస్తూ, పిల్లల సంతోషంలో తన సంతోషం వెతుక్కుంటాడు తండ్రి. కుటుంబమే తన ప్రపంచంగా, అడక్కుండానే అన్నీ ఇచ్చి, అడిగిన ప్రతిదీ సమకూరుస్తుంటాడు. నాన్న ప్రేమ అద్భుతం...అనంతం... తన ఇష్టాలు మరచి, తన వారి కోసం బతికే నాన్న, పిల్లలకు ఓ ధైర్యం, ఓ స్వాంతన, ఓ రోల్ మోడల్, ఓ గైడ్. జీవితం ఇచ్చేది తల్లైతే, జీవన విధానాన్ని నేర్పేది తండ్రి. బిడ్డల విజయాలకు ఆనందించే తండ్రి, వైఫల్యాలు ఎదుర్కొన్నప్పుడు వారిని వెన్ను తట్టి ధైర్యం అందిస్తాడు. నిరంతరం బిడల్ల ఉన్నతికై అహర్నిశలు పాటుపడే తండ్రి, వాళ్ల తప్పటడుగులు వేస్తే సరిదిద్దే బాధ్యత తనే వహిస్తాడు. తన వారి కోసం ఆలోచిస్తూ, తన ఇష్టాలు మరచిపోతాడు. నాన్న చేసే త్యాగాలు, ప్రేమ వగైరాల గురించి ఎన్నో సినిమాలు రావడం జీవితంలో నాన్న పాత్ర ప్రాధాన్యతను చెప్పకనే చెబుతున్నాయి. "ఓ నాన్నా! నీ మనసే వెన్నా, అమృతం కన్నా, అది ఎంతో మిన్నా" అంటూ నాన్న హృదయాన్ని వ్యక్తం చేసే పాటలు కోకొల్లలు. ఆడపిల్లను అత్తారింటికి పంపే సమయంలో తండ్రి పడే వేదన మాటల్లో తెలుపలేనిది. శకుంతలను అత్తగారింటికి పంపే సమయంలో కణ్వమహర్షి ఎంతో దుఃఖిస్తాడు". పెంచిన తండ్రినైనా తనకే యింత బాధ కలిగితే సొంత తండ్రికి కుమార్తె వియోగం ఎంత బాధ కలిగిస్తుందో కదా అని కణ్వ మహర్షి మరింత కృంగిపోయారు. ఎందరో కవులు తమ మొదటి రచనలను తండ్రికి అంకితమివ్వడం తండ్రిపై వారికున్న ప్రేమానురాగాలకు తార్కాణం. ఆధునిక కవులు ఎందరో తండ్రిపై కవిత్వం వెలయించారు. బీరం సుందరరావు 'నాన్న ఓ అన్‌సంగ్ హీరో' అనే కవితలో "రక్తాన్ని మోసుకెళ్లే ధమని నాన్న.. బరువు బాధ్యతల ముఖచిత్రమై.. బతుకు పుస్తకానికి.. భాష్యం చెప్పేవాడు నాన్న" అంటారు. "నేను నీలా పరివర్తనం చెందాలని.. నేను నీలా ఫలప్రదమైన జీవితం గడపాలని.. ఎప్పటికీ నేను నీ కేరాఫ్‌నే.. ఎన్నటికీ నువ్వు నా కేరాఫ్ చిరునామావి కాదు.. అంటారు. కొడుకులంతా తండ్రుల కేరాఫ్ కావడం కన్న గొప్ప సన్మానం తండ్రికి మరి ఏమి ఉంటుంది! కొడుకులు ఎంత గొప్పవారైనా తండ్రి నీడలో ఒదిగి ఉండడమే వారు తండ్రికిచ్చే గౌరవం. నాన్న ప్రేమ అవ్యక్తం. సదా బిడ్డల ఉన్నతిని కాంక్షించే తండ్రి పట్ల భయభక్తులే కాదు, మమతానురాగాలు కూడా ఉండాలి.

"నాన్న ఎందుకో వెనుకబడ్డాడు" అనే కవితలో కవి పనసకర్ల ప్రకాశ్‌నాయుడు అంటారు. 'అమ్మ తొమ్మిది నెలలు మోస్తే.. నాన్న పాతికేళ్లు.. రెండూ సమానమే అయినా నాన్న ఎందుకో వెనుకబడ్డాడు.. ఇంట్లో జీతం తీసుకోకుండా అమ్మ.. తన జీతమంతా ఇంటికే ఖర్చు పెడుతూ నాన్న.. ఇద్దరి శ్రమ ఒకటే అయినా.. నాన్న ఎందుకో వెనకబడ్డాడు.. 'నాన్న ఇలా వెనకబడి పోవడానికి కారణం.. ఆయన అందరికీ వెన్నెముక కావడమే".. అవ్యక్తమయిన తండ్రి ప్రేమను గుర్తించి నేటి యువతరం తండ్రుల పట్ల బాధ్యతతో మెలగాలి. వారిని వృద్ధాశ్రమాల పాలుకాకుండా కంటికి రెప్పలా కాచుకోవాలి. 'పితృదినోత్సవం' నాడు చూసే ప్రేమ జీవితాంతం కనబరిస్తే అప్పుడే 'పితృదినోత్సవం' సఫలమైనట్లు. "దేహము, విజ్ఞానము. బ్రహ్మోపదేశము ఇచ్చి, ఇహపరాలు సాధించే హితమిచ్చిన తండ్రే' అన్న ఓ సినీ కవి మాటలు అక్షరసత్యాలు.

ఆధునిక సమాజంలో అమ్మా, నాన్న ఉద్యోగస్తులే. చదువుల్లో, ఉద్యోగాల్లో సరిసమానులే. ఇంటి పనుల్లోను సమాన బాధ్యతలే. అంతేకాదు. నేటి తండ్రులు కుటుంబ బాధ్యతలతో బాటు పిల్లల పెంపకాన్ని కూడా సమంగా పంచుకుంటున్నారు. పసిబిడ్డల ఆలనా పాలనా చూసుకొనేందుకు ఉద్యోగాలకి సైతం సెలవు పెట్టి మరీ ఇంటిపట్టున ఉంటున్నారు. తండ్రులలో ఇది ఒక మంచి పరిణామం. నేటి సమాజంలో పుట్టిన నాటి నుండే బిడ్డల బాధ్యతలను తండ్రి పంచుకోవడంతో తండ్రి, బిడ్డల మధ్య సాన్నిహిత్యం పెరిగి, బంధం దృఢమవుతున్నది. నాన్న ప్రేమ ఇతివృత్తంగా ఎందరో కవులు, గాయకులు పాటలు, కవితలు, గజల్స్ రాస్తున్నారు, పాడుతున్నారు. "చెట్టుకేమో విత్తుకు రుణమున్నది తెలియలేదు! నాకేమో నాన్న విలువ ఎంతన్నది తెలియలేదు" అని డా.రెంటాల వెంకటేశ్వరరావు రాసిన గజల్ తండ్రి ప్రేమను కళ్లకు కడుతుంది.

తండ్రుల వారసత్వాన్ని పుణికిపుచ్చుకొన్న కొందరు బిడ్డల మనోభావాలు



తండ్రి: మాధవపెద్ది మూర్తి
కుమార్తె: ప్రతిభ మాధవపెద్ది

నా తండ్రి కూచిపూడి నృత్య కళాకారుడు. నేను బాల్యం నుండి నా తండ్రి నృత్యం చూస్తూ పెరిగాను. నా ప్రథమ గురువు మా నాన్నే. నేను మొదట ఇచ్చిన సోలో నాట్య ప్రదర్శనకు 'నట్టువాంగం' చెప్పింది కూడా మా నాన్నే. నాన్నతో కలసి ఎన్నో నాట్య ప్రదర్శనలు ఇచ్చాను. అవన్నీ నా జీవితంలో మరుపురాని ఘట్టాలు. నాన్న దగ్గర నేను ఎన్నో విలువలు నేర్చుకున్నాను. స్వేచ్ఛగా ఎదిగేందుకు, నాకు నచ్చిన అంశాలను ఎంచుకొనేందుకు నాకు స్వాతంత్ర్యం ఇచ్చారు. 'జీవితంలో నచ్చింది చేయమని, ఏది చేసినా అంకితభావంతో చేయమని....' నాన్న చెప్పే మాటలు నాకు ఆదర్శం.

తండ్రి: డా.కందనూరు సీతారామయ్య
కుమారుడు: డా.శ్రీరామ్



మా నాన్న డా.సీతారామయ్య మనసున్న మంచి వైద్యులు. సేవాభావం, వృత్తి పట్ల నిబద్ధత కలిగిన గొప్ప మనిషి. మా వంశంలో ఆరుతరాలుగా వైద్య వృత్తి వారసత్వంగా వస్తున్నది. నేను వైద్యవృత్తిలో ప్రవేశించడానికి కారణం, ప్రేరణ మా నాన్న గారే! నాన్న వైద్యంతో ఆరోగ్యం మెరుగైన ఎందరో మా ఇంటికి వచ్చి నాన్నతో తమ ఆనందాన్ని పంచుకోవడం బాల్యం నుండి గమనించడం వలన, నాకూ డాక్టర్ కావాలన్న కోరిక కలిగింది. కలిసి భోజనం చేసే సమయాలలో ఎప్పుడూ ప్రాచీన ఆయుర్వేదం, పతంజలి యోగా, ఆధునిక వైద్యంలోని నూతన ఆవిష్కరణలు, భారతీయ సంస్కృతి మొదలైన వాటి గురించి ఎన్నో విషయాలు మాకు తెలియజేసేవారు. కరోనా మహమ్మారి ప్రపంచాన్ని వణికిస్తున్న సమయంలో 88 ఏళ్ల వయస్సులో కరోనా బాధితులకు సేవచేయాలని తపించారంటే, ఆయన వైద్య సేవాతత్పరతకు ఇంతకు మించి తార్కాణం ఏముంటుంది? వైద్య వృత్తిలో సేవాభావం ముఖ్యం కానీ ధన సంపాదన కాదని తన బిడ్డలకు బోధించడమే కాక డాక్టరైన తన మనుమడికి కూడ చెప్పడం విశేషం. వైద్యసేవతో పాటు సమాజ సేవ, సాహిత్య సేవ మా తండ్రిగారికి ఇష్టమైన అభిరుచులు. వైద్యసేవ నాకు సంక్రమిస్తే, సమాజ, సాహిత్య సేవలు మా అన్నయ్య కందనూరు మధుకు అలవడ్డాయి.

తండ్రి: సాలూరి రాజేశ్వరరావు
తనయుడు: సాలూరి వాసూరావు



మా నాన్నగారి సంగీత వారసత్వాన్ని అందిపుచ్చుకొని, వారు సంగీతం అందించిన ఎన్నో సినిమాలకు వారికి సహాయకుడుగ పనిచేసిన అదృష్టం నాకు లభించింది. ఎవరినీ నొప్పించని మనస్తత్వం మా తండ్రి గారిది. పిల్లలను కూడా మన్నించి మాట్లాడడం ఆయనలోని మరో సుగుణం. పెండ్యాల, బాపు మొదలైన ఎందరో ప్రముఖులను సినిమా రంగానికి పరిచయం చేసిన విశిష్ట వ్యక్తి ఆయన. ఆణిముత్యాలైన 'మల్లీశ్వరి', 'మిస్సమ్మ', 'చెంచులక్ష్మి', 'విప్రనారాయణ' మొదలైన ఎన్నో సినిమాలకు సంగీత దర్శకత్వం వహించిన ఘనత ఆయనది. 'నా మెలోడీ వాసుకు అబ్బింది. నాపేరు నిలబెడతాడని' మా నాన్న గారు అన్న మాటలు, నేను అందుకున్న పురస్కారాలన్నిటికంటే మిన్న. మా తండ్రి సంగీత వారసత్వమే నేను 38 మంది మ్యూజిక్ డైరెక్టర్లకి బాస్ గిటార్ వాయించేందుకు కారకమైంది. నాన్నగారి సంగీత దర్శకత్వాన్ని నిశితంగా పరిశీలించడం వల్లనే నేను 56 సినిమాలకు సంగీత దర్శకత్వం వహించగలిగాను. 508 టీవీ సీరియల్స్‌కి టైటిల్ సాంగ్స్, బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ అందించానంటే అది మా తండ్రి నుండి నేను అబ్బిన సంగీత జ్ఞానం వల్లనే.

తండ్రి: డా.లక్ష్మీనారాయణరావు
ప్రకృతి వైద్యనిపుణులు
తనయ: డా.రోజా గురుమూర్తి
ప్రకృతి వైద్యనిపుణురాలు



నేను ప్రకృతి వైద్యం చదవడానికి కారణం ప్రకృతి వైద్యనిపుణులైన మా నాన్నగారే. ఆయన ప్రకృతి వైద్యచికిత్సతో ఎందరో రోగులు ఆరోగ్యవంతులు కావడం గమనించిన నాకు ఆ వైద్యం పట్ల ఆకర్షణ, ఆసక్తి కలిగింది. ప్రకృతి వైద్యంతో మనం ఆరోగ్యంగా జీవించవచ్చని నాన్నగారు చెప్పిన మాటలు నాకు స్ఫూర్తి కలిగించాయి. ప్రకృతి వైద్యానికి యోగాని అనుసంధానించి వైద్యం చేస్తుంటాను. నేను ఎమ్.ఎస్‌సీ సైకాలజీ కూడా చేయడంతో అవసరమైన చోట్ల, ఒత్తిడికి గురి అయిన వారికి కౌన్సిలింగ్ చేయడం కూడా జరుగుతుంటుంది. ప్రకృతి వైద్యం అంటే ఉపవాసాలు చేయడం, పచ్చికూరలు తినడం అని చాలా మంది భావిస్తారు. అది అపోహ మాత్రమే. ఈ వైద్యంలో ఎన్నోరకాల చికిత్సలని మేళవించడం జరుగుతుంది. ఏ మాత్రం వికటింపులు లేని, అందరికీ అందుబాటులో ఉండే వైద్య విధానం ప్రకృతి వైద్యం. ఈ వైద్యాన్ని బహుళవ్యాప్తిలోకి తేవాలన్నది మా నాన్నగారి ఆశయం. అందుకోసం నా వంతు కృషిచేస్తున్నాను.

శ్రీనివాసుడి తిరుకల్యాణం నిర్వహిస్తున్న వెంకటాద్రి సమాజం నిర్వాహకులు - విచ్చేసిన భక్తులు





వైభవంగా శ్రీనివాసుడి కల్యాణం

గోవింద నామస్మరణతో మార్మోగిన పొన్నియమ్మన్‌మేడు

ప్యారీస్, జూన్ 16 : స్థానిక మాధవరం పొన్నియమ్మన్ మేడు మోహన్ నగర్‌లోని శ్రీవెంకటాద్రి భజన సమాజం ఆధ్వర్యంలో శ్రీ శ్రీనివాసతిరు కళ్యాణమహోత్సవం ఆదివారం కనులపండువుగా జరిగింది. పొన్నియమ్మన్‌మేడు జవహర్‌లాల్ నెహ్రూ రోడ్డులోఉన్న ఉమియ మహల్ వేదికగా సాగిన ఈ దైవ వివాహమహోత్సవంలో త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన జీయర్‌స్వామి, త్రిదండి అహోబిల రామనుజ జీయర్‌స్వాముల పర్యవేక్షణలో ఉదయం 7.45 గంటలకు మహా తిరుమంజనం, అభిషేకం, కాశీయాత్ర, మాలల మార్పిడి, ఊంజల్‌సేవ, మహాసంకల్పం, హోమం తదితర పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం ఉదయం 11 నుంచి 12.45 గంటలలోపు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాసుల తిరుకళ్యాణాన్ని మంగళవాయిద్యాలు, వేదపండితుల మంత్రోచ్చాటనలు, భక్తుల గోవింద నామస్మరణల మధ్య అంగరంగవైభోగంగా నిర్వహించారు. శ్రీమాన్ భక్త పార్థసారథి రామానుజర్ ఆశీస్సులతో లోకసంక్షేమార్థం శనివారం సాయంత్రం ఏడు గంటలకు గరుడసేవ, శ్రీజన్మరక్షక హరినామ సంకీర్తనం, నాట్యాంజలి, భక్తిగీతాల ఆలాపన తదితర కార్యక్రమాలను నిర్వహించారు. శ్రీవెంకటాద్రి భజన సమాజం అధ్యక్షులు కే పద్మరాజ్, కార్యదర్శి కే ఐశ్వర్య తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించి భక్తులందరికీ అన్న, తీర్థ ప్రసాదాలు, ముత్తయిదువులకు పసుపుకుంకములు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ఎస్కేపీసీ ప్రిన్సిపాల్ డా. టి. మోహనశ్రీ వ్యాఖ్యాతగా వ్యవహరించారు. ఈ సందర్భంగా త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన జీయర్‌స్వామి మాట్లాడుతూ వెంకటాద్రి భజనసమాజం ఆధ్వర్యంలో ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించడం వల్ల భక్తుల మదిలో భక్తిభావాలు అధికమవుతాయని, సమాజంలోప్రశాంతం వాతావరణం నెలకొంటుందని పేర్కొన్నారు.

తిరుచెందూరు ఆలయానికి
పోటెత్తిన భక్తులు



తిరుచెందూరు ఆలయం వద్ద భక్తుల రద్దీ

చెన్నై, జూన్ 16(ఆంధ్రజ్యోతి): కుమారస్వామి కొలువైన ఆరు దివ్యక్షేత్రాలలో ద్వితీయ క్షేత్రమైన తిరుచెందూరు సెంథిల్ ఆండవర్ ఆలయాన్ని దర్శించేందుకు ఆదివారం ఉదయం వేల సంఖ్యలో భక్తులు పోటెత్తారు. వారంతపు శని, ఆదివారాలతోపాటు బక్రీద్ సందర్భంగా సోమవారం కూడా సెలవు కావడంతో రాష్ట్రం నలమూలల నుంచి భక్తులు కుటుంబ సమేతంగా ఈ క్షేత్రానికి విచ్చేయడంతో ఆలయ పరిసర ప్రాంతాలన్నీ భక్తులతో రద్దీగా మారాయి. భక్తులు ఆదివారం వేకువజామునే సముద్రతీరంలోనూ, నాళికినరు తీర్థంలో స్నానమాచరించడానికి బారులు తీరారు. వీటన్నింటికీ తోడు ఆదివారం ఉదయం పెళ్ళి ముహూర్తం కూడా తోడవడంతో ఆలయంలో పెళ్ళిళ్లు కూడా జరిగాయి. వేల సంఖ్యలో భక్తులు తరలిరావడంతో స్వామివారిని దర్శించడానికి సుమారు ఐదు గంటలు పట్టింది. వేకువజాము నాలుగు గంటలకు ఆలయాన్ని తెరచి, 4.30 గంటలకు విశ్వరూప దర్శనం, ఐదుగంటలకు ఉదయమార్తాండ అభిషేకం నిర్వహించారు. శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకూ తిరుచెందూరు నగరానికి భక్తులతో వచ్చిన కార్లు, వ్యాన్, బస్సులను ట్రాఫిక్ పోలీసులు తిరుచెందూరు - నాగర్‌కోవిల్ రహదారిలో పార్కింగ్ చేశారు. ఇదేవిధంగా ఆలయ పరిసరాల్లోనూ అక్కడి పోలీసుస్టేషన్ వద్ద వాహనాల పార్కింగ్‌కు అనుమతించారు. ఇక ఉదయం ఐదు గంటల నుంచే తిరుచెందూరు సముద్రతీరమంతటా భక్తులు పెద్దసంఖ్యలో గుమికూడి స్నానమాచరించారు.



సముద్రతీరంలో స్నానమాచరించేందుకు గుమికూడిన భక్తులు



టీఆర్ఎం శతజయంతి వేడుకల్లో పి.సుశీల తదితరులు

టీఆర్ మహాలింగం శత జయంత్యుత్సవాలు ప్రారంభం

ప్రముఖ నాటక కళాకారుడు, సినీ నటుడు, సినీ గాయకుడు ఇలా బహుముఖ ప్రజ్ఞాశాలిగా గుర్తింపు పొందిన టీఆర్ మహాలింగం శతజయంతి వేడుకలు మదురై జిల్లా చోళవందాన్‌కు సమీపంలో ఉన్న తెన్నకరై సమీపంలో ఆదివారం ఉదయం ప్రారంభమయ్యాయి. ఈ వేడుకల్లో ప్రముఖ సినీ నేపథ్యగాయని పి.సుశీల పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి ఈ వేడుకలను ప్రారంభించారు. రెండురోజులపాటు ఈ వేడుకలను నిర్వహించనున్నారు. ఈ వేడుకల్లో భాగంగా తొలుత నాదస్వర విద్వాంసుడు వలైయపట్టి సుబ్రమణియన్ బృందం ఆధ్వర్యంలో నాదస్వర సంగీత కచ్చేరి జరిగింది. టీఆర్ మహాలింగం, గోమతి మహాలింగం చారిటబుల్ ట్రస్ట్ తరఫున టీఆర్ మహాలింగం కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ వేడుకకు మద్రాస్ హైకోర్టు సీనియర్ న్యాయవాది టీకే గోపాలన్ అధ్యక్షత వహించారు.నడిగర్ సంఘం అధ్యక్షుడు నాజర్, సినీ నేపథ్య గాయకుడు సీర్గాళి శివసిదంపదం, నడిగర్ సంఘం ఉపాధ్యక్షుడు పూచ్చి మురుగన్, తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వ డాక్టర్ ఎంజీఆర్ ఫిల్మ్ సిటీ, టీవీ డైరెక్టర్ నటుడు రాజేష్, హాస్య నటుడు సెంథిల్, నటి సచ్చు, నటుడు అన్నాదురై కన్నదాసన్ పాల్గొన్నారు.

చిత్రజ్యోతి

21న కమల్ హాసన్ 'గుణ' రీరిలీజ్



'గుణ'లో ఓ దృశ్యం

విశ్వనటుడు కమల్ హాసన్ నటించిన హిట్ చిత్రాల్లో 'గుణ' ఒకటి. ఈ చిత్రం ఈ నెల 21వ తేదీన రీ రిలీజ్ చేస్తున్నారు. గత 1991లో సంతాన భారతి దర్శకత్వంలో తెరకెక్కి, ఆ యేడాది దీపావళి స్పెషల్ మూవీగా విడుదలైంది. స్వాతి చిత్ర ఇంటర్నేషనల్ పతాకంపై తెరకెక్కిన ఈ చిత్రం రాజ్‌కమల్ ఫిల్మ్ ఇంటర్నేషనల్ ప్రపంచ వ్యాప్తంగా రిలీజ్ చేసింది. సుమారుగా 33 యేళ్ళ తర్వాత మళ్ళీ రీరిలీజ్ చేసేందుకు ఈ చిత్రాన్ని రీరిలీజ్ చేస్తున్నారు. దీనికి కారణంగా, ఈ చిత్రంలోని పాటలతో ఈ సినిమా స్టోరీ నేటి కాలపు యువత కూడా ఎంతో ఎంజాయ్ చేస్తున్నారు. డిజిటల్ సాంకేతికతతో ఈ సినిమాకు మరిన్ని మెరుగులు దిద్ది... పిరమిడ్ ఆడియో కంపెనీ మూవీని ప్రపంచ వ్యాప్తంగా రిలీజ్ చేయనుంది. ఈ చిత్రంలో హీరోయిన్లుగా రేఖ, రోషిణిలు నటించగా, ఇళయరాజా సంగీత స్వరాలు సమకూర్చారు. ఈ చిత్రాన్ని కొడైక్కెనాల్‌లోని పర్యాటక ప్రాంతాల్లో చిత్రీకరించారు. సినిమా షూటింగ్ జరిపిన ప్రాంతాన్ని గుణ కేవ్స్‌గా పేరుపెట్టారు.


తండ్రికి ఆడబిడ్డలు ఎన్నటికీ చిన్నపిల్లలే : హీరో అర్జున్



ఐశ్వర్య - ఉమాపతి దంపతులతో అర్జున్, తంబి రామయ్య

ఏ తండ్రికైన ఆడబిడ్డలు వివాహమైనప్పటికీ చిన్నపిల్లలులాగే కనిపిస్తారని సీనియర్ హీరో అర్జున్ అన్నారు. అర్జున్ పెద్ద కుమార్తె ఐశ్వర్య, సీనియర్ క్యారెక్టర్ ఆర్టిస్ట్ తంబిరామయ్య కుమారుడు ఉమాపతి రామయ్యల వివాహం ఈ నెల 10వ తేదీన జరగ్గా, తమిళ సినిమా విలేకరులతో శనివారం రాత్రి విందు పార్టీ ఇచ్చారు. ఇందులో నూతన వధూవరులతో పాటు హీరో అర్జున్, తంబి రామయ్య, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. ఇందులో అర్జున్ మాట్లాడుతూ, 'ఈ వేదికను ఒక నటుడిగా పలుమార్లు ఎక్కిదిగాను. ఇపుడు ఒక బిడ్డకు తండ్రిగా, ఒక యువకుడికి మామగా నిలబడివున్నాను. నా సినీ కెరీర్‌లో ఎన్నో ఎత్తుపల్లాలు చవిచూశాను. తంబి రామయ్యతో కలిసి అనేక చిత్రాల్లో నటించాను. కానీ, మేమిద్దరం వియ్యంకులమవుతామని మా ఇద్దరికీ తెలియదు. మంచి సంప్రదాయ కుటుంబం. విదేశాల్లో నేను నిర్వహించిన ఓ కంటెస్ట్‌లో ఉమాపతి ఒక పోటీదారుడిగా పాల్గొన్నాడు. అపుడే అతను నాకు బాగా నచ్చాడు. ఉమాపతిని త్వరలోనే ఒక యాక్షన్ హీరోగా చూస్తారు. అందుకు అవసరమైన అన్ని లక్షణాలు అతనిలో ఉన్నాయి.నా మొదటి బిడ్డ ఐశ్వర్య. అప్పటి నుంచి కొన్ని అనుకోని సంఘటనలు జరుగుతున్నాయి. ఓ రోజున నా చిన్న కుమార్తె నా వద్దకు వచ్చి..'డాడీ.. అక్క మీతో ఒంటరిగా మాట్లాడాలని ఉందని చెప్పింది.ఆ తర్వాత నా వద్దకు వచ్చి అసలు విషయం చెప్పగా, యువకుడు ఎవరని అడిగాను. ఉమాపతి అని చెప్పడంతో నేను ఒకింత షాక్‌కు గురయ్యాను.ఆ తర్వాత ఇరు కుటుంబాల సమ్మతంతో విజయవంతంగా వివాహం జరిగింది. ఇప్పటికీ ఐశ్వర్య ఒక చిన్నపాపలాగే నాకు కనిపిస్తుంది. ప్రతి తండ్రికి తన కుమార్తెకు వివాహమైనప్పటికీ ఆమె ఒక చంటిబిడ్డలాగే కనిపిస్తుంది' అని పేర్కొన్నారు.

ఎస్పీ బాలు స్మారక మందిర నిర్మాణ పనులు ప్రారంభం



ఎస్పీబీ మెమోరియల్ పనుల ప్రారంభ దృశ్యం

అమర సినీ నేపథ్యగాయకుడు, బహుముఖ ప్రజ్ఞాశాలి దివంగత ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యం స్మారక మందిర నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ఈ నిర్మాణ పనులను ఆయన తనయుడు, సినీ నేపథ్య గాయకుడు ఎస్.పి.బి.చరణ్ మొదలుపెట్టారు. తమిళం, తెలుగు, కన్నడం, మలయాళం, హిందీ అలా అనేక భాషల్లో నేపథ్యగానం చేసి, కోట్లాది మంది అభిమానుల మనసుల్లో చెరగని ముద్ర వేసుకున్నారు. ఈ నేపథ్యంలో గత 2020 సంవత్సరంలో కరోనా మహమ్మారి బారిన పడి అనారోగ్యంతో తుదిశ్వాస విడిచారు. ఆయన మృతి కోట్లాది మంది అభిమానులను శోకసముద్రంలో మునిగిపోయేలా చేసింది. ఆయన పార్థివదేహాన్ని తిరువళ్లూరు జిల్లాలోని తామరైపాక్కం అనే గ్రామంలో ఉన్న ఎస్పీబీ ఫామ్‌హౌస్‌లో ఖననం చేశారు. ఈ ప్రాంతంలో ఇపుడు ఎస్పీబీ స్మారక మందిర నిర్మాణ పనులు ప్రారంభించారు. 'నా కలల ప్రాజెక్టును ప్రారంభించాను... ఎస్పీబీ మెమోరియల్... అంటూ ఎస్పీబీ చరణ్ తన ట్విటర్ ఖాతాలో ట్వీట్ చేశారు.